ఈ ప్రశ్నకు అవతారికా పద్యములలోనే సంతృప్తికరమగు సమాధానము లభించుచున్నది. 36వ పద్యమున, కృష్ణరాయల భార్యయైన తిరుమలదేవికి తాను పుట్టితి ననియు, తనకు మొదట పెట్టిన పేరు తిరుమలాంబ యనియు, కాని భార్యపేరు గూడ తిరుమల యగుటచే కూతునాపేరనే పిలువ నిష్టపడక తన తండ్రి కృష్ణరాయలు తనను మోహనాంగి యను కూర్మి పేరుతో పిలువగడగినాడనియు మోహనాంగి తెలిపియున్నది. 91, 92 పద్యములలో కృష్ణరాయలకు అన్నపూర్ణాదేవియును, తిరుమలదేవియును పట్టపుదేవులై వాసిగాంచిరనియు వారిలో తిరుమలాంబకు తానును, అన్నపూర్ణకు వెంగళాంబయు జన్మించిరని తెలిపియున్నది. తన భర్త అళియరామరాజనిచెప్పి అతని సౌందర్య ప్రాభవములను 12, 13, 14 పద్యములయందు చెప్పియున్నది. ఈమె సోదరి (వైమాత్రి) వెంగళాంబయే, అళియరామరాజు తమ్ముడై, వసుచరిత్ర కృతిపతియైన, తల్లికోట భీభత్సము (క్రీ.శ.1565) తర్వాత, జీర్ణకర్ణాటసామ్రాజ్యమును పునరుద్ధరింప శాయశక్తులా ప్రయత్నించిన, తిరుమలరాయల భార్య.[3] పట్టాభిషిక్తులై, విజయనగర వజ్రసింహాసనము నధిష్ఠించిన ఆరవీటి వంశజులలో తిరుమలరాయలే మొదటివాడు. ఇట్లు

రామరాయలును, అతని తమ్ముడు తిరుమలరాయలును కృష్ణరాయనికి అల్లుళ్లగుచున్నారు. చాగంటి శేషయ్యగారు వెంగళాంబ సంగతి చెప్పలేదుకాని, రాయలకు కృష్ణమాంబయను మరియొక తనయగలదనియు, ఈమె "మట్ల బొమ్మరాజునకు ప్రపౌత్రుడును. సోమరాజునకు బౌత్రుడును పోతరాజునకుఁ గుమారుడును నగు వరదరాజునకు భార్యయయ్యెను" అని వ్రాసియున్నారు. కాని దీనికి ఆధారమేదో వారు తెలుపలేదు.[4]

పై చర్చననుసరించి, **మారీచీపరిణయ** కర్త కృష్ణరాయల ప్రథమ సంతానమైన మోహనాంగియను ముద్దుపేరుగల తిరుమలాంబయని ప్రస్తుతమునకు అంగీకరింతము.

2. తెలుగువారి ఎరుకలో మారీచీపరిణయము– మారీచీపరిణయ కర్తృత్వము - రచనాకాలము

ఈ అవతారికా పద్యములలో చెప్పబడిన మిగిలిన చారిత్రకాంశములను చర్చించుటకు ముందు, ఈ కావ్యము నిజముగా మోహనాంగి వ్రాసినదా, ఎప్పుడు? లేక ఆమె పేరున మరెవ్వరైనను వ్రాసియుండిన ఆ వ్రాసినవారెవ్వరు, వారికాలమేది? అను విషయములను గురించి నేడు మనకు లభ్యమగు ఆధారములను బట్టి ఒక నిర్ణయమునకు రావలసియుండును. కొండూరు వీరరాఘవాచార్యులవారు

1970 ఏప్రిల్ **భారతి** లో, సెట్టి లక్ష్మీనరసింహంగారు 1929 **సమదర్శిని** లో ఈ **మారీచీపరిణయ** అవతారికా పద్యములను ప్రకటించు వరకు, ఈ కావ్యపుటునికి తెలుగు వారికి తెలియదను అర్థములో "మొన మొన్నటివరకు నీ కావ్యమున్నట్లు తెలుగువారికి తెలిసినట్లులేదు" అని వ్రాసినారు. కాని వారి ఈ ఊహ సరియైనదికాదు. నేటికి దాదాపు 150 సంవత్సరముల నాడే ఈ కావ్యమును గురించి తెలుగు వారికి బాగా తెలియునని చెప్పుటకు ప్రామాణికమైన ఆధారము కలదు. 1829 లో కావలి వెంకటరామస్వామిగారు **Biographical Sketches of Dekkan Poets** (**దక్కను కవిజీవితములు**) అను ఆంగ్లగ్రంథమును బొంబాయినుండి ప్రచురించియున్నారు. వారు ఈ గ్రంథమున 37 గురు సంస్కృతకవుల, 46 గురు తెలుగు కవుల, 13 గురు తమిళ కవుల, 13 గురు మహారాష్ట్ర కవుల జీవితవిశేషములను గురించి తమనాటికిలభ్యమైన సమాచారమును ఈ గ్రంథమున పొందుపరచియున్నారు. ఈసమాచారము ప్రామాణిక లేఖ్యములు (authentic documents) ఆధారముగ సమకూర్చబడినదని తెలుపుచూ, ముఖపత్రము మీద ఇట్లు వ్రాయబడియున్నది;

"Biographical Sketches of the Dekkan Poets being memoirs of the Lives of Several Eminent Bards both

Ancient and Modern who have flourished in different provinces of the Indian Peninsula. Compiled from Authentic Documents. By Cavelly Venkata Ramaswamy Pundit, Corresponding Member to the Royal Asiatic Society, Bombay Printed at the Victoria Press by Ramchunder Dhondsett."

ఇంకనూ, వారు ఈ గ్రంథమునకు వలయు సమాచారము సేకరించిన విధమును గురించి ఉపోద్ఘాతము (Preface) నందు ఇట్లు నుడివియున్నారు:

"The materials to compile the present Biographical Sketches were collected by me while I followed in an official capacity through different Provinces my master Colonel Collin Mackenzie C. B. Surveyor General of India;" (Preface, p. ix)

"ఈ జీవిత ఆలేఖ్యములను సమకూర్చుటకు వలయు సామగ్రిని, నేను అధికారహోదాలో మాయజమాని యైన కల్నల్ కాలిన్‌మ్యాకెంజి సి. బి. సర్వేయర్ జనరల్ ఆఫ్ ఇండియా వారి వెంబడి, వివిధ రాష్ట్రములలో సంచరించునపుడు సేకరించబడినది." (ఆముఖము, పుట. ix)

దీనినిబట్టి రామస్వామి ఈ దక్కను కవిజీవితము లను రచించుటకు కావలసిన ప్రామాణ్యలేఖ్యములను అధికారహోదాలో తాము జరపిన దేశసంచారమున సేకరించినారనుట విదితము.

రామస్వామిగారి 1829 నాటి ఈ గ్రంథమున పేర్కొనబడిన తెలుగు కవులలో **మారీచీపరిణయ** కర్త్రియైన మోహనాంగి యొకతె. ఆమెను గురించి వారిట్లు వ్రాసియున్నారు :

" This poetess was a princess. and the daughter of Kristna Roya, she received an excellent education in her infancy and was well versed in rhetoric and poetry; while in the bloom of youth she married Ramaroyulu, after which she still continued her studies, and employed much of her time in reading those works, in Talugu composed by the poets at her fathers court; by constant application she attained to considerablc proficiency, in the art of versification, and wrote a poem entitled "Marichi Parinaya" the subject of which is taken from Mahabharat; in this poem very elegant description is given, of the Marichi damsels, the work consists of five books; this Princess had no issues and became unfortunately a widow: in the prime of life (according to tradition) she was immolated on the funeral pile of her husband " *(Dekkan Poets*, pp. 77–78)

ఈ వ్రాతనుబట్టి రామస్వామిగారు ఐదు ఆశ్వాసములు గల ఈ కావ్యప్రతిని స్వయముగా చూచుటయో, లేక దాని ఎరుకగలవారినుండి తెలుసుకొనుటయో జరిగినదని మన మనుకొనవలసి యున్నది. ఇంతేగాక, పాండురంగమాహాత్మ్య

కర్తయైన తెనాలి రామలింగని వికటత్వమును గుఱించి వ్రాయుచు, సందర్భానుసారముగా ఈ మోహనాంగి మారీచీపరిణయము ను గుఱించి మరల ఇట్లు ప్రస్తావించి యున్నారు :

"..... ; some time after this, the daughter of the king had composed a poem called, "Marichi Parnega" the nuptials of Marichi; and proposed to read it to Kristna Deva, before the whole court, but as she was aware of the satirical character of Ramalinga, she stipulated with her father that he should not be allowed to be present; the king consequently forbad Ramalinga to come into court; on the day however, that the princess publickly read her poem, Ramalinga disguised himself as a female attendant, and, concealing his face, stood close to the king's daughter, who began reading with an audible voice; the poem really was very well written and contained moral reflection, and beautiful descriptions of the scenery, and dresses of females, and various other subjects; among which was the description of a pregnant woman; just at this moment Ramalinga made a waggish remark and gesture, which set the whole court in a roar of laughter; this so abashed and confounded the princess, that she could read no more, and abruptly left her father;" (*Dekkan Poets*, pp. 56–57)

దీనినిబట్టి మారీచీపరిణయము నీతిబోధలు, ప్రకృతి వర్ణనలు, వేషభాషాది వర్ణనలతో గూడిన ఐదు ఆశ్వాస

ముల మనోహర కావ్యమని తెలియుచున్నది. ఇందులో రామలింగని అపహాస్యమునకు పాలైన గర్భిణీస్త్రీ వర్ణన గూడా కలదని మనమెరుగుచున్నాము. ఇచ్చిన వివరము లను బట్టి రామస్వామిగారో, లేక దాని వివరములను గురించి రామస్వామికి తెలిపినవారో, ఈ కావ్యమును స్వయముగా పరిశీలించినట్లు మనము ఊహించవలసియున్నది. కనుక నేటికి దాదాపు నూటఏబది ఏండ్లనాడే ఈ కావ్యము తెలుగు దేశమునందు బహుళ ప్రచారమున నున్నట్లు రామస్వామిగారి వాక్యములవలన విదితము. కావున సెట్టి లక్ష్మీనరసింహముగారు కాని, 150 ఏండ్ల ఇవ తల మరెవ్వరుగాని ఈ కావ్యమును ప్రాసి మోహనాంగికి అంటగట్టినారని చెప్పుటకు వలనుపడదు. అట్టి పనిపడ్డానా జరిగియున్న అది 150 సంవత్సరములకు ముందే జరిగి యుండ వలయును. అట్టి పని చేసినవారెవ్వరు అని ప్రశ్నించిన దానికి ఉత్తరమిచ్చుటకు నేడు మనకెట్టి ఆధారమును లేదు. బహుళా సాహిత్య, చరిత్ర పరిశోధకుల అన్వేషణా ఫలితముగా **మారీచీపరిణయ** పూర్తిప్రతి దొరకిన, దానిలో మనకు ఇది మోహనాంగి ప్రాసినదికాదు అను అంతఃస్సాక్ష్యము (Internal Evidence) ఏమైన దొరకిన, ఈ గ్రంథము ఆమెదికాదు అని చెప్పగలమేమోకాని, అంత వరకు ఇది ఆమె గ్రంథమనియే నమ్మవలసి యుండును.

పోగా, ఇది ఆమె గ్రంథముకాదు అని అనుమానించవల
సిన అవసరమేమి అని ప్రశ్నించవచ్చును. అనుమానమేల
నన, ఈ అవతారికా పద్యములలో తెలిపిన కృష్ణరాయ
వంశాదికము, జీవిత విశేషములుకొన్ని, గత 60 ఏండ్లుగా
విజయనగరసామ్రాజ్య చారిత్రకులు పరమసత్యములుగా
నమ్మిచున్న విషయములకు విరుద్ధముగా నున్నవి. కృష్ణ
రాయల తనయయే ఈ కావ్యము వ్రాసినదని రుజువైన
పక్షమున, చారిత్రకాచార్యులు బహుకాలముగా నమ్మి
చున్న ఈ నిర్ణయములను మార్చుకొనుటయేగాక, విజయ
నగర చరిత్రయేకొంతవరకు మార్చి వ్రాయవలసియుండును.
పోగా, ఇది మోహనాంగి వ్రాసినను, మరెవ్వరు వ్రాసినను,
నూటపబదిఏండ్లకు మనము ఊహామరికగా మరియొక ఏబది
ఏండ్లు చేర్చి, నేటికి రెండువందల ఏండ్లక్రింద వ్రాయబడిన
కావ్యమనుకొన్నను, దీని చారిత్రక విలువ, ప్రాముఖ్యత,
నేడు విజయనగరచరిత్రకు ఆధారములుగా గ్రహించబడు
చున్న **రాయవాచక, కృష్ణరాయవిజయము** లకు తీసిపోవునది
కాదు.[5] **మారీచీపరిణయము** లో అసందర్భములు, కాల
నిర్దేశప్రమాదములు (anachronisms) కొన్ని కలవని మన
మనుకొన్నను, అవి **రాయవాచక, కృష్ణరాయలవిజయము** ల
లో గల వానికన్నను మించిపోయినవి కావు. విజయనగర
చరిత్రలో, కృష్ణరాయలజీవితములో మనమెరిగియున్న

చారిత్రకవిషయములను కొన్నింటిని ఇది ధృవపరచుచున్నది. సత్యశోధనలో నిగ్గుదేల్చవలసిన నూతన విషయములను కొన్నిటిని చెప్పుచున్నది. ఈ దృష్టిలో ఈ కావ్యమున కెంతేని ప్రాముఖ్యము కలదు.

ఈ అవతారికాపద్యములయందు ఇవ్వబడిన చారిత్రక విశేషములను, పూర్వపండితుల అభిప్రాయములతో సమన్వయించి, నా ఎరుక గలిగినంతమటుకు మీ ఎదుట ఉంచెదను. వీనిలో ఇవ్వబడిన చరిత్రాంశములు కొన్ని తదితర విజయనగర వాఙ్మయమునందును చెప్పబడి, చరిత్రకారులచే చర్చింపబడి, వారి ఆమోదముద్ర పొంది, సర్వపండిత జనాంగీకారములై గ్రంథస్థములై యున్నవి. అట్టి అంశముల నేనీ ఉపోద్ఘాతమున దడవక, విజయనగర చరిత్రయందును, ఆంధ్రసాహిత్య చరిత్రయందును నేటికిని వివాదాంశములై చర్చనీయాంశములై, ఈ పద్యములయందు గానవచ్చు విషయములే ఇచట కొంత పరిశీలన గావింపబడును.

3. ఈ కావ్యమును మోహనాంగి వ్రాసియుండని ఎడల, ఎవరు, ఎప్పుడు వ్రాసి యుండవచ్చును?

ఈ కావ్యము మోహనాంగిచే, కృష్ణరాయలకాలమున వ్రాయబడనియెడల, ఎప్పుడు ఎవరిచే వ్రాయబడి

యుండవచ్చునని ఆలోచింతము. ఈ కావ్యమును మోహనాంగి ప్రాసియుండని యెడల, దీనిని ఎవరో సదాశివరాయల కాలము (క్రీ. శ. 1542-1576) ననో, అటు తర్వాతనో ప్రాసియుండవలయును. ఈ కావ్యము మూడు ఆశ్వాసములు రచించునప్పటికి కృష్ణరాయ తిరుమలాదేవులకు సదాశివుని కృపవలన సదాశివుడను పుత్రుడు గలిగి దినదిన ప్రవర్థమానుడై ఎదుగుచున్నాడని 4వ ఆశ్వాసాదిని తెలుపబడియున్నది. ఈ ఆశ్వాసమునందలి మొదటి పద్యమున కృష్ణరాయల నుద్దేశించి "శ్రీ సుమశర సమరూపవిలాస విభాసుర సుపుత్రలాభప్రాప్త" అని చెప్పబడి ఉన్నది. శాసనాధారమునను, న్యూనిజ్ ప్రాతలవల్లను, నేటికి చరిత్రకారులు ఎరిగినంత వరకు, కృష్ణరాయలకు తిరుమలరాయలను కొడుకున్నట్లును, వృద్ధుడైన కృష్ణరాయలు 1524లో అతనికి పట్టాభిషేకము గావించి సింహాసనస్థుని చేసినట్లును, ఆ పిల్లవాడు పట్టాభిషేకానంతరము 8 నెలలకు చనిపోయినట్లు మాత్రమే తెలియును గాని,[6] సదాశివరాయలను కొడుకున్నట్లు తెలియదు. కాని 1530లో కృష్ణరాయలు చనిపోవునప్పటికి అతనికి 18 నెలల నిసుగొకడున్నట్లును, ఆ పసికందునకు రాజ్యార్హతలేనందున, చంద్రగిరియందు బంధింపబడియున్న తన సవతితల్లి కుమారుడు అచ్యుతరాయని వారసునిగ నియమించి, తన అనంతరము అతడు

రాజ్యమునకు వచ్చినట్లు కట్టుదిట్టములు చేసి కృష్ణరాయలు దివంగతుడాయెనని న్యూనిజ్ తెలుపుచున్నాడు.[7] దీనిని బట్టి మారీచీపరిణయమునందు పేర్కొనబడిన కృష్ణరాయని కుమారుడు అతని ప్రథమపుత్రసంతానమై యుండవలయును; కాని దీనియందు ఇతనిపేరు తిరుమలరాయలని గాక సదాశివరాయలని చెప్పబడియున్నది. ఆనాటి రచయితలలో కూటో (Couto) అను పోర్చుగీసువాడొక్కడు మాత్రము కృష్ణరాయలకు సదాశివుడను ఒక కొడుకున్నట్లును, అతడు రాయల అనంతరము తన 13వ ఏట సింహాసనమధిష్ఠించినట్లును చెప్పియున్నాడు.[8] కాని ఈవ్రాతనే ఆధారము చేసుకొని ఏమియు చెప్పుటకు వీలుకాదు. ఒకవేళ తిరుమలరాయలకు సదాశివరాయలని నామాంతరముండెనేమో. నేడు మనకు తెలిసియున్న సదాశివరాయలు కృష్ణరాయల వైమాత్రేయుడును, అచ్యుతరాయలతమ్ముడును అగు రంగరాయల కొమారుడు సదాశివరాయలు; అచ్యుతరాయని తర్వాత 1542-1576 వరకు నామమాత్రముగా విజయనగర సింహాసనమధిష్ఠించిన వాడు. ఈ మారీచీపరిణయమును మోహనాంగిగాక కృష్ణరాయలకాలమునకు తర్వాత ఎవరైన ప్రాసియుండిన యెడల, సదాశివరాయలు కృష్ణరాయల కొడుకని చెప్పుట తెలియకచేసిన తికమకయై యుండవలెను. సదాశివరాయల కాలమునసే ఇది వ్రాయ

బడియుండిన ఇట్టి తికమకకు అవకాశములేదు గదా. కావున ఈకావ్యమును, మోహనాంగి ప్రాసియుండనిపక్షమున, ఎనరో నదాశివరాయలకాలము తర్వాత, బహుశా 1600-1750 ల మధ్య ప్రాసియుండవచ్చును. ఈ అవతారికా పద్యములలో 10వ పద్యమున కృష్ణరాయడు విష్ణుచిత్తీయము ను రచించెననియు, దానిలో అలసాని కవీశుని అల్లికబిగి, ముక్కుతిమ్మకవి ముద్దుపల్కు, పాండురంగకవి పదక్రమము కలవని చెప్పబడియున్నది. ఈ పద్యములో చెప్పబడిన కవిత్రాగుణవర్ణన కాకుమాని మూర్తికవిదైన ఈ క్రింది పద్యమును జ్ఞప్తికి దెచ్చుచున్నది.

"అలసానివాని యల్లిక జిగి బిగి
ముక్కుతిమ్మనార్యు ముద్దుపలుకు
పాండురంగ విభుని పదగుంభనంబును
గాకమానిరాయ నీకెతగురు"

ఈ కాకుమాని మూర్తికవి 16వ శతాబ్ది ఉత్తరార్ధమున ఉన్నవాడు. దీనిని బట్టి, - కాకుమాని మూర్తికవే మోహనాంగిని ఈ పద్యంలో అనుకరించాడనుకోకపోతే- **మారీచీపరిణయ** రచనాకాలం పదిహేడవ శతాబ్దంలోనో, అటుతర్వాతనో అని చెప్పవలసి ఉంటుంది. ఒకవేళ కాకుమాని మూర్తికవే దీనిని ప్రాసి, మోహనాంగి పేరుతో

చలామణి చేయలేదుగదా అనికూడా అనుమానించవచ్చు; ఏలనన మారీచీపరిణయమున పేర్కొనబడ్డ పాండురంగ మాహాత్మ్య కర్త యైన తెనాలి రామకృష్ణుడు కృష్ణరాయల సమకాలీనుడు గాదని కొందరు చరిత్రజ్ఞులు నమ్మచున్నా రుగదా.

4. మోహనాంగి ఈ కావ్యము ప్రాసియుండిన యెడల ఎప్పుడు ప్రాసియుండును?

ఒకవేళ మోహనాంగియే ఈకావ్యము ప్రాసియుండిన ఎప్పుడు ప్రాసియుండునని విచారింతము. 10వ పద్యములో తన తండ్రి కృష్ణరాయలు విష్ణుచిత్తీయమును రచించెననియు, దానిలో అలసాని కవీశుని అల్లిక బిగి, ముక్కుతిమ్మకవి ముద్దుబల్కు, బొండురంగకవి పదక్రమము కలవని చెప్పి యున్నదికదా. అనగా ఈ మారీచీపరిణయము, ఆముక్త మాల్యద తర్వాత రచింపబడిన గ్రంథము. మారీచీపరిణ యమున మూడుఆశ్వాసములు రచించునాటికి, కృష్ణరా యనికి చిరకాలకాంక్షిత పుత్రప్రాప్తి యొనగూడినదని చతుర్థాశ్వాస ప్రారంభమున మోహనాంగి చెప్పియున్నది. కృష్ణరాయలకు పట్టమహిషి తిరుమలదేవియందు 1-12-1517, 30-10-1518 ల మధ్య — అనగా 1518 లో అక్టో బరు నెల ముందుగల నెలలలో, ఎదోఒకదాని యందు ఒక

శుభసమయమున—పుత్రుడు గలిగినట్లు ఆచార్య నేలటూరు వేంకటరమణయ్యగారు శాసనోదాహరణములతో సోపపత్తికముగ నిరూపించియున్నారు.9 పోగా, మారీచీపరిణయమునందు (వచనము 17), కృష్ణరాయలు "చిన్నాంబా మనోహరుడు" అని పేర్కొనబడి, ఆకావ్యరచనాకాలము నాటికి చిన్నాదేవి సజీవముగా నున్నదని సూచించుచున్నది. ఆముక్తమాల్యదయందు రాయల దేవేరులలో చిన్నాదేవి పేర్కొనబడకపోవుటచే, ఆకావ్యరచన పూర్తియగునాటికి (1518)[10] చిన్నాదేవి మరణించియుండవచ్చునని పరిశోధకులు భావించడమైనది. తిరుపతి దేవస్థానమున శా.శ. 1438, ధాతసంవత్సర పుష్య శు. 10 నాడు (క్రీ.శ. 2 జనవరి 1517) వ్రాయించిన రాయల శాసనములో[11] చిన్నాదేవి రాయల దేవేరులలో నొకతెగా పేర్కొనబడి, శ్రీకృష్ణరాయల మంత్రులలో నొకడగు కొండమరుసయ్య శా.శ. 1439, ఈశ్వరసంవత్సర మార్గశిర బ. 2 (క్రీ.శ. 1 డిశంబరు 1517) నాడు వ్రాయించిన చోళసముద్రం (అనంతపురంజిల్లా) శాసనములో[12] రాయల దేవేరులలో చిన్నాదేవి పేర్కొనబడకపోవుటచే, చిన్నాదేవి 2-1-1517, 1-12-1517 ల మధ్య ఎపుడో చనిపోయియుండవలయునని తలచబడుచున్నది. కావున రాయల పుత్రజననకాలము, చిన్నాదేవి మరణకాలము ఆధారముగా తీసుకొందుమేని, మోహనాంగి,

2-1-1517, 1-12-1517ల మధ్య, ఎపుడో, చిన్నాదేవి ప్రతికి యున్నపుడు, తనరచనను ప్రారంభించి. 1-12-1517, 30-10-1518 ల మధ్య, ఎపుడో, రాయలపుత్రజననమునాటికి 3 ఆశ్వాసములు పూర్తిగావించినదని చెప్పవలసి యుండును.

5. ఆముక్తమాల్యద రచనాకాలము.

ఇదే ఆధారముగ 1518 నాటికి ఆముక్తమాల్యదా రచన ముగింపబడి యుండవలయును. ఆముక్త రచనా ప్రారంభకాలమును గురించి పండితులలో బేధాభిప్రాయములు గలవు. ఈ కాలనిర్ణయము ఆముక్తమాల్యదలో రాయలువారు పేర్కొన్న స్వప్నకాలనిర్ణయముపై ఆధారపడియున్నది. ఈ కాలనిర్ణయమును వీరేశలింగము పంతులుగారు A.D. 1515 అనియు,[13] కె. వి. లక్ష్మణరావుగారు 11-2-1519 అనియు,[14] కుందూరి ఈశ్వరదత్తుగారు 27-1-1519 అనియు,[15] ఓరుగంటి రామచంద్రయ్యగారు 3-11-1519 అనియు,[16] చాగంటి శేషయ్యగారు జనవరి 1516 అనియు,[17] చేసియున్నారు. మారీచీపరిణయ ఉపపత్తులను బట్టిచూడగా చాగంటి శేషయ్యగారు చేసిన కాలనిర్ణయము నిజమునకు దగ్గరగా ఉన్నదని చెప్పవచ్చును. ఏలన, శ్రీకాకుళాంధ్రవిష్ణుదేవుడు స్వప్నమున గోచరించి ఆముక్తమాల్యదా కావ్యమును ప్రాయమని ఆదేశించిన

పిమ్మట, ఆ ప్రబంధమును వ్రాయుటకుమున్ను తనతండ్రి కృష్ణరాయలు సింహాచలాధినేతను కొలిచెనని 93వ పద్యమున మోహనాంగి చెప్పియున్నది. రాయల ఈ సింహాచల దేవుని దర్శనము 1518కు ముందు జరగియుండవలెను. రాయలు సింహాచలదేవునికి కానుకలర్పించుచు వ్రాయించిన మొదటి శాసనము ధాతసంవత్సర చైత్ర బహుళ 12నకు సరియగు 26-3-1516 నాటిది.[18] రాయల సింహాచల రెండవ శాసనము 8-8-1519 నాటిది.[19] ఈ రెండవ శాసనముతో మనకిచట ప్రస క్తి లేదు. రాయలు ఆముక్తమాల్యదా కృత్యాదియందు "మున్నేకళింగదేశ విజిగీషామనీషం దండెత్తిపోయి విజయవాటిం గొన్నివాసరంబులుండి శ్రీకాకుళనికేతనుండగు నాంధ్రమధుమథను సేవింపబోయి" అనిచెప్పియున్నాడు. దీనికి సరిపోవునట్లు రాయలవారు, తమ కళింగదేశ దిగ్విజయ యాత్రలో సింహాద్రి పోటూరున జయస్తంభం వేసి, తిరిగి విజయనగరానకు విచ్చేసి, అటుపై తిరుమలదేవి చిన్నాదేవి సమేతంగ తిరువేంగళ నాథునికి కానుకలర్పింప తిరుమలకు విచ్చేసి "శాలివాహన శకము 1434 అగు నేటి ధాత సంవత్సర పుష్య శుద్ధ 10 శు నాండు" (క్రీ.శ. 1517 జనవరి 2వ తేది) వేయించిన శాసనంలో "సామ్రాజ్యం చేస్తున్న మరిని కళింగదేశ దిగ్విజయార్థమై బెజవాడకు విచ్చేసి" అని వ్రాయబడి యున్నది.[20] ఈ శాసనం లో పేరొక్కనబడిన, ఆముక్తమాల్యదలో పేరొక్కనబడిన

రాయలవారి బెజవాడ విడిది, వేర్వేరైన రెండు సంఘటన లనుగాక, రాయలవారి ఒకే బెజవాడ విడిదిని సూచిస్తాయి. దీనినిబట్టి 26-3-1516నకు, కొన్ని, బహుశా ఒకటి రెండు నెలల ముందుగా ఒక హరివాసరమున రాయలవారు శ్రీకాకుళాంధ్రదేవుని దర్శించియుండి, 26-3-1516న సింహాచలదేవుని కొలచిన తర్వాత, కొద్దికాలములోనే **ఆముక్త మాల్యద**ను ఒక శుభదినమున ప్రారంభించియుండవలయును. **మారీచీపరిణయ** రచన మూడాశ్వాసములు పూర్తియై, కృష్ణరాయలకు పుత్రజనన మైననాటికి, బహుశా చిన్నాంబా దేవి మరణమునకు ముందే, ఈ **ఆముక్తమాల్యద** రచన పూర్తియై యుండవలయునని **మారీచీపరిణయము** సూచించు చున్నది (వచనము 17, పద్యములు 10, 93; 4వ ఆశ్వాసము, 1-4). చిన్నాదేవి 2-1-1517, 1-12-1517ల మధ్య ఎప్పుడో చనిపోయి ఉండవలయుననియు, రాయలకు పుత్రజననము 1-12-1517, 30-10-1518ల మధ్య ఎప్పుడో కలిగియుండవలెననియు పైన చెప్పియుంటిమి.[21] దీనినిబట్టి రాయలవారు 26-3-1516 తర్వాత ఒక శుభదినమున **ఆముక్తమాల్యదా** రచన కుపక్రమించి, చిన్నాంబాదేవి ప్రతికియుండగనే పూర్తిచేసియుండిన 1-12-1517కు ముందుగానో, చిన్నాంబాదేవి మరణము తర్వాతగూడ కొంతకాలము రచన సాగించియుండిన 30-10-1518 నాటికి ముందుగానో దాని రచనను ముగించియుండవలయును. కావ్యమును

పూర్తి చేసిన తర్వాత, తన కృతజ్ఞతలను తెలుపుకొనుటకై 27-1-1519 నాడు శ్రీకాకుళ తెలుంగురాయని దర్శించి, ఆ దేవుని అంగరంగభోగాదులకై రాయలు కొన్ని గ్రామాలు అర్పించుకొన్నారు.[22] అట్లే 8-8-1519 నాడు సింహాద్రి అప్పని దర్శించి, ఆ దేవునికి తన పేరింటి భోగం నడిచే అందుకుగాను, తనమామగారైన ప్రతాపరుద్రగజపతి మహారాయల చేతను, కొన్నిగ్రామాలు పుచ్చుకొని, వానిని స్వామికి సమర్పించారు.[23]

6. పారిజాతాపహరణము, మనుచరిత్ర, పాండురంగమాహాత్మ్యముల రచనాకాలము_రెండవ పర్యాయము రాయల కళింగజైత్రయాత్ర కలదా?

మారీచీపరిణయ సాక్ష్యమును బట్టి పారిజాతాపహరణము, మనుచరిత్ర, పాండురంగమాహాత్మ్యముల రచన 1518 (అనగా రాయల పుత్రజననము) నాటికే, మరో మాటగా, మనుచరిత్రయందు రాయల దేవేరులలో చిన్నాదేవి పేర్కొనబడియున్నందున, ఆమె 31-12-1517 నాటికి చనిపోయిఉండవచ్చునని తలచబడుచున్నందున, 31-12-1517 నాటికి ముందే పూర్తియైనట్లు తలచవలసి యున్నది. మనుచరిత్రలో అల్లసాని పెద్దన రాయలపూర్వదిగ్విజయ

యాత్రను వర్ణించుచూ, రాయలు కళింగదేశమును కటకము వరకు జయించెనని చెప్పియున్నాడు.[24] 1516లో పొట్నూరున జయస్తంభము వేయించిన తరువాయిగా, 1518లో రాయలు రెండవసారి కళింగముపైకి వెడలెనునియు, ఈ రెండవ కళింగ జైత్రయాత్రయందే కటకము వరకు జయించెననియు, పై కనుపరచిన 27-1-1519నాటి శ్రీకాకుళ శాసనము, 8-8-1519నాటి సింహాచలశాసనము ఈ సందర్భమున వేయించినవే యనియు ఒక వాదము గలదు.[25] కాని మారీచీపరిణయ సాక్ష్యము ప్రకారము రాయల ఈ రెండవ కళింగ జైత్రయాత్రకు తావు లేదు; కావున పైన కనుపరచిన 27-1-1519, 8-8-1519నాటి శాసనములు ఈ జైత్రయాత్రాసందర్భమున వేయించినవని చెప్పుటకు వీలులేదు. దీనికి బలముగా గుంటూరుమండలమందలి కొమ్మూరు గ్రామమున రాయలసేవకుడగు లక్ష్మీకాంతరుసు ధాత సంవత్సర ఫాల్గుణ బ॥ ౫ గురువారము (12, మార్చి 1517) నాడు వ్రాయించిన శాసనములో రాయలు "కటకము మేరగాను" జయించినట్లు వ్రాయబడియున్నది.[26] ఈ సందర్భమున పైన పేర్కొనబడిన 8-8-1519నాటి సింహాచల రెండవ శాసనములో[27] రాయలవారు సింహాచలదేవునికి అర్పించిన గ్రామములు ప్రతాపరుద్రగజపతినుండి జయించబడినవని చెప్పక "ప్రతాపరుద్రమహారాయల వద్ద పుచ్చుకొన్న గ్రామములు" అని చెప్పుట గమనార్హము.

కొమ్మూరుశాసనమున చెప్పినట్లు 12-3-1517నాటికే రాయలు కటకము వరకు జయించియుండిన, మనుచరిత్ర రచన 12-3-1517కి ముందుగా ఎప్పుడో ప్రారంభింపబడి, రాయల పుత్రజననము (1518) నాటికి ముందెప్పుడో పూర్తి గావింపబడి యుండవలయును. మనుచరిత్రయందు రాయల దేవేరులలో చిన్నాదేవి పేర్కొనబడియుండుటచే, బహుశా అది 1-12-1517కు ముందుగా, ఆమె బ్రతికియున్న కాలమునసే పూర్తి గావింపబడి యుండవచ్చును.

7. రామకృష్ణకవి : రాయలసమకాలీనత.

ఆముక్తమాల్యదా కవితాగుణములలో పాండురంగకవి పదక్రమమొకటిగా **మారీచీపరిణయము** పేర్కొనియుండుటచే (పద్యము 10), ఆముక్తమాల్యదా రచనాకాలమునకు (1518)కు ముందే రామకృష్ణుడు తన **పాండురంగమాహాత్మ్యమును** పూర్తిచేసినాడని తలచవలసియుండును. రామకృష్ణుని కాలమును గూర్చి, అతడు రాయల సమకాలికుడై అష్టదిగ్గజములలో నొకడుగానుండినవాడా అను విషయమును గూర్చి పండితులు చాలగ చర్చించి యుండిరి.[28] వీరిలో అధికులు రామకృష్ణుడు కృష్ణరాయల సమకాలీనుడనియే తలచి, అతనికి అష్టదిగ్గజములలో స్థానమిచ్చిరి.[29] నేలటూరు వేంకటరమణయ్యగారు శాసనాధారముగ **పాండురంగ మాహాత్మ్యము** కృష్ణరాయలవారి రాజ్యకాలము తుదనో,

తరువాత అచిరకాలమునకో విరచితమయ్యెనని" యూహిం చినారు.[30] **పాండురంగమాహాత్మ్య** రచనాకాలమును వేంకట రమణయ్యగారు యూహించిన కాలముకంటే ముందు ఉంచిన పండితులెవ్వరును లేరు. కాని మారీచీపరిణయము నందు చెప్పినదానినిబట్టి చూచిన దానిరచన 1518కి ముందే జరిగియుండవలయును. ఈ మారీచీపరిణయకర్త్రి మోహ నాంగియే అయినపక్షమున, రామకృష్ణ, కృష్ణరాయల సమకాలీనతను గురించి వివాదము అనవసరము.[31] ఒకవేళ మోహనాంగి ఈకావ్యమును వ్రాయకపోయినను, తరువాతి కాలమందున్న ఒక ప్రామాణిక అభిప్రాయముగా దీనిని గ్రహించుటకు మనకు అభ్యంతరము ఉండబోదు.

8. సాళువ, తుళువ వశంముల మూలపురుషుడు ఒకడేనా? సాళువ వంశము తుళువ వంశాంతర్గతమా?

40 నుండి 63 వరకుగల పద్యములలో కృష్ణరాయల వంశాభివర్ణన చేయబడినది.[32] ఈ వంశాభివర్ణన పౌరాణి కముగా తుర్వసుని, చారిత్రకముగా సాళువవంగును సాళువ తుళువ వంశముల రెంటికిని మూలపురుషుల చేసినది. మను చరిత్రమున తుర్వసువంశమే తుళువవంశమైనదని చెప్ప బడియున్నది.[33] పారిజాతాపహరణమున కృష్ణరాయలు

తుర్వసు వంశజుడుగానే పేర్కొనబడినాడు.[34] మారీచీపరిణయమున తుర్వసవంశరాజులలో తుళువవంశజు లొకరని చెప్పి, ఆ తుళువవంశజులలో మంగమనృపతి "విపక్షపక్షి తతిసాళువమై మెలగుట" అతని సంతతి ప్రభవించినవారలు సాళువవారైరని చెప్పబడి యున్నది. కృష్ణరాయల తండ్రియు, సాళువ వంశజులలో రాయసింహాసన మలంకరించి ప్రఖ్యాతుడైన సాళువగుండ నరసింహరాయల సేనాధిపత్రియునైన నరసానాయకుడు ఈ **మారీచీపరిణయ** వంశాను క్రమణిక ప్రకారము సాళువనరసింహరాయల అన్న మనుమడు. అనగా కృష్ణదేవరాయలు సాళువనరసింహరాయల అన్నమనుమని కొడుకు లేక మున్మనుమడు లేక ప్రపౌత్రుడు. దీనినిబట్టి పౌరాణికముగా సాళువ వంశము తుళువ వంశాంతర్గతముగాగ, చారిత్రకముగ తుళువవంశము సాళువవంశాంతర్గత మగుచున్నది. తుళువవంశజులు క్షత్రియులా, శూద్రులా యని ఒక చర్చ గలదు. **మారీచీపరిణయ** వంశకథనమే మనము ఒప్పుకొన్న సాళువవంశజులు చంద్రవంశక్షత్రియులని తెలిసియున్న విషయమే గాబట్టి, తుళువ వంశజులు అదే కులమునకు చెందినవారగుటచే చంద్రవంశక్షత్రియులని నిస్సంశయముగా చెప్పవచ్చును. కాని సమకాలీన విజయనగర సారస్వతమునందుగాని, శాసనాదులయందుగాని సాళువ, తుళువవంశజులకు ఎట్టి బాంధవ్యమును

సూచింప బడలేదు. **మారీచీపరిణయమునందే** (పద్యములు 50, 62) సాళువ నరసింహరాజు **జైమినిభారతము** కృతి నందినాడనియు, నరసానాయకుడు, నందిమల్లయ, మలయ మారుత (ఘంట సింగయ) కవులు రచించిన **వరాహపురాణము** కృతి నందుకొన్నాడనియు తెల్పబడియున్నది. **జైమినీ భారతము**లో పిల్లలమర్రి పినవీరభద్రుడు గావించిన సాళువ వంశక్రమమున **తుళువవంశ** ప్రస క్తియే లేదు.[35] సాళువ నరసింహుని సేనాధిపతిగానుండి, కృష్ణరాయల జనకుడైన నరసానాయకుడు కృతిగొన్న **వరాహపురాణము**లో కృతిపతియైన నరసానాయకుని వంశవర్ణనమును, కృతిపతి ప్రభువైన సాళువనరసింహరాయల వంశవర్ణనమును చేయబడినవి; కాని దీనిలో రెండువంశములకు ఎట్టి బాంధవ్యమును చెప్పబడ లేదు.[36] అంతేగాక, సాళువ **నరసింహరాయలను** చంద్రవంశీయుడని వర్ణించి, నరసానాయకునితండ్రియై, సాళువ నరసింహరాయల సేనాధిపతియైన ఈశ్వరుని 'నాయక' శబ్దముచే మాత్రము పేర్కొనుటయు, నరసానాయకునిగురించి చెప్పునపుడు అతడు క్షత్రియుడని చెప్పకపోవుటయు, తుళువవంశజులని చెప్పబడు కృష్ణరాయని తాతతండ్రులు నిజముగా క్షత్రియులా అను సంశయమునకు తావిచ్చుచున్నది. **వరాహపురాణమున** ఈశ్వర, నరసానాయకులను తుళువవంశజులు అనిగాని, వారు పురాణపురుషుడైన

తుర్వసునిసంతతివారని గాని చెప్పబడియుండలేదు. మొదటిసారిగా ఈ 'తుర్వస' ప్రస క్తి కృష్ణదేవరాయల యన్నయై, సాళువనరసింహరాయల కుమారుడైన ఇమ్మడి నరసింహుని తోసిరాజని, రాయసింహాసన మధిష్ఠించిన వీరనరసింహరాయలశాసనములలో కనపడుచున్నది.[37] అనగా మొదటిసారిగా వీరనరసింహరాయల కాలముననే ఒక పౌరాణిక వంశవర్ణన సృష్టింపబడి తుళువ వంశజులు చంద్రవంశ క్షత్రియులనిపించుకొనుటకు చేసిన ప్రయత్నము గానవచ్చుచున్నది. కృష్ణరాయల కాలమున పెద్దన, తిమ్మనాదులు తమకావ్యములందు కృష్ణరాయని బాహాటముగా చంద్రవంశక్షత్రియుడనియే వర్ణించియున్నారు. ఈ పౌరాణిక వంశవర్ణన యంతయు కట్టుకథ అని తెలిసియే గాబోలు, మారీచీపరిణయ రచయిత (మోహనాంగి) ఒక పద్యము (45)న, "దుర్వసుశబ్దసంభవము తుళువశబ్దమో? లేక తద్వంశ జాతు లరితత్తుల గెలిచి వారి సతులకుఁ దులువ లైరో" అని తన సంశయమును చమత్కరించినట్లున్నది.

కాని మారీచీపరిణయమున జెప్పినట్లు తుళువవంశము సాళువ వంశాంతర్గతమని జెప్పుటకు నేటి చారిత్రకులకు విజయనగర సారస్వత, శాసనాదులయందు ప్రమాణాంతరములు లేకపోయినను, ఇది పూర్తిగా తోసివేయదగ్గ విషయముకాదు. ఏలనన, సుప్రసిద్ధ చారిత్రపరిశో

ధకులగు కొమర్రాజు వేంకట లక్ష్మణరావుగారు 1908 నాడే తాను రచించిన **మహమ్మదీయ** మహాయుగమున తుళువ వంశము సాళువ వంశాంతర్గతమని చెప్పుచూ ఇట్లు వ్రాసి యున్నారు: "ఈ **తుళువవంశము** సాళువ వంశాతర్గతము: సాళువ నరసింగరాజు తండ్రి గుండరాజు. అతని కిద్దఱు కొమారులు. మొదటివాడు తిమ్మరాజు; రెండవవాడు సాళువ నరసరాజు, తిమ్మరాజునకు నీశ్వరరాజును నా యీశ్వరరాజునకు నీ **తుళువ** నరసరాజును పుట్టిరి. కావున తుళువ నరసరాజు సాళువ **నరసరాజు**నకు అన్న మనుమడు"[38] మరియు "మరణ సమయము సమీపించినదని తెలిసికొని (నరసింహ) రాయలు **తుళువ** నరసరాయలను బిలిపించెను. ఈ నరసరాజు సాళువ నరసరాజునకు అన్నమనుమడు; ఈశ్వరరాజు పుత్రుడు, సేనాధిపతి."[39] లక్ష్మణరావుగారి కంటెముందు, 1896 లో వీరేశలింగం పంతులుగారు, నంది మల్లయ, ఘంట సింగయ కవుల చారిత్రము వ్రాయుచూ సాళువ నరసింహరాయలకు **తుళువ** నరసరాజు అన్నమను మడని బొంధవ్యము చెప్పలేదుగాని, పైన చెప్పబడిన "తిమ్మయ ఈశ్వరరాజు సాళ్వగుండ నరసింహరాజునకు సేనా నాయకుడగుటయే గాక దాయాదుడుకూడ నయియుండుట చేత నుభయుల యనంతరమునను నీశ్వరరాజుపుత్రుడును సాళ్వగుండ నరసింహరాయని యప్పటి సేనాధిపతియునైన

బలవంతుఁడగు తుళువ నరసింహరాయఁడు సంతానహీను డయి కాలధర్మము నొందినతర్వాత తనప్రభువుయొక్క రాజ్యభారము వహించినట్లు తోఁచుచున్నది." అని వ్రాసి యున్నారు. [40] లక్ష్మణరావుగారు కాని, వీరేశలింగం పంతులుగారు గాని తమ ఈ వ్రాతలకాధారమేదియో తెలుపలేదు. లక్ష్మణరావుగారు చెప్పిన వంశక్రమము ఖచ్చితముగా **మారీచీపరిణయమునందు** ఈయబడిన వంశ క్రమముతో సరిపోవుచున్నది. ఒకవేళ వీరిద్దరు మోహనాంగి **మారీచీపరిణయమును** చూచియే ఇట్లు వ్రాసిరేమో! అట్లుకానియెడల, **మారీచీపరిణయమున** పేర్కొనబడిన వంశక్రమమునకు ప్రమాణాంతరము కలదనియే మనము నమ్మవలసియుండును. ఈ సందర్భమున కృష్ణరాయలు దాల్చిన సాళువ బిరుదములను మనము జ్ఞప్తియందుంచు కొనవలెను. [41] **మారీచీపరిణయమునందలి** వంశాభివర్ణనలో మనము గమనించవలసిన మరియొక విశేషమేమన, సాళువ నరసింహరాయలకును, తుళువ ఈశ్వర, నరసా నాయకుల కునుగల ప్రభు-సేవక సంబంధము ఏమాత్రము తెలుపబడ లేదు. అల్లసాని పెద్దన, ముక్కు తిమ్మనాదులు సాళువ, తుళువ వంశములకు గల ఈ బాంధవ్యము తెలిసియుండియు, తమకావ్యములయందు ఈబాంధవ్య ప్రస్తి అప్రస్తుత మనియో, లేక గతమున సాళువ, తుళువ వంశజులకు గల

ప్రభు-సేవక సంబంధము వలన ఆ బాంధవ్యమును స్మరించుట ఔచిత్యభంగమనియో, చెప్పక వదిలివేసిరని మనము తలచ వలసి యుండును.

9. శ్రీకృష్ణరాయలతల్లి భోగకాంతయా?

శ్రీ కృష్ణరాయలతల్లియైన నాగలాంబ అతని తండ్రి నరసానాయకుని భోగకాంతయని యొక ప్రవాదమున్నది. నరసానాయకుడు కృతినందిన **వరాహపురాణము**నగాని, నరసా నాయకుని శాసనములలోగాని యాతని భార్యలగురించి యేమియు చెప్పబడలేదు. కాని వీరనరసింహరాయలనాటి శాసనము లామెను నరసనాయకునిభార్యగానే చెప్పి యున్నవి. అట్లే కృష్ణరాయలనాటి శాసనములలోను. వాఙ్మయమునందును, **అచ్యుతరాయాభ్యుదయము** 42 నందును చెప్పబడియున్నది. మారీచీపరిణయము కూడా నరసానాయకుడు తిప్పాంబతోపాటు నాగాంబను గూడా "పరి ణయ మయ్యెన్" అని చెప్పుచున్నది. (పద్యము. 63).

10. శ్రీకృష్ణరాయల జననము

మారీచీపరిణయమున కృష్ణరాయలజననము శాలి వాహనశకము 1393 కు సరియైన వికృతి సంవత్సర పుష్య బహుళద్వాదశి శుక్రవార మని చెప్పబడియున్నది

(పద్యము, 66). దీనికి సరియైన ఇంగ్లీషు తేది 17_1_1471.[43] కొన్ని ఉపపత్తులు ఆధారముగ ఈ జన్మదినము నమ్మ వలసినదిగా తోచుచున్నది. వీరేశలింగంపంతులు తమ ఆంధ్రకవులచరిత్రయందు, మారిచీపరిణయము నందివ్వ బడిన సంవత్సర మాస తిథి వారములతో సరిపోయి, శాలి వాహనశకము మాత్రము తప్పుగా "శకాబ్దముల ద్రివసు త్రిసోములన్" (శా.శ. 1387, క్రీ.శ. 1465) అని ఇవ్వ బడిన, కృష్ణరాయలజన్మదినమును తెలుపు చాటువును పేర్కొనియున్నారు.[44] శాలివాహనశకము తప్పుగా ఇచ్చి వున్నదను నెపమున చాగంటి శేషయ్యగారు ఈ చాటువు తెలుపు జన్మదినము పూర్తిగా అవిశ్వాసనీయమని తోచి పుచ్చినారు. వారు శాలివాహనశకమును సవరించుటకు బదులు విక్రృతి సంవత్సరమును సవరించినారు.[45] మారీచీ పరియణములోని పద్యమున శాలివాహన శకవత్సరము సరిగా ఇవ్వబడియుండుటచే, చాగంటి శేషయ్యగారి అను మానమునకు తావులేదు. వారు తమవాదమునకు బల ముగా, రాయల జన్మనక్షత్రము జ్యేష్ఠయు, మాసము వైకాసి (వైశాఖము) అని పేర్కొనబడినదని చెప్పబడు నెల్లూరు జిల్లాయందలి ఒక తమిళ శాసనమును ఉదహరించినారు.[46] ఈ శాసనమును మా మిత్రులు, తమిళ భాషాపారంగతులు, భాషాప్రవీణ, విద్యాప్రవీణ శ్రీ యస్. రాఘవన్ గారిచే చది

పించగా, వారు, శాసనములోని వ్రాతనుబట్టి రాయలజన్మనక్ష త్రము జ్యేష్ఠయనియు, కాని వారు పుట్టిననెల వై శాఖ మనియే తలచవలసిన అవసరము లేదనియు తెలిపినారు. రాఘవన్ గారు చెప్పినది సరియని తోచుచున్నది; ఏలనన, రాయలనాటి వేరొక శాసనమున వారి జన్మనక్షత్రము మాసినెల, యందలి జ్యేష్ఠానక్షత్రముగా చెప్పబడి యున్నది.[47] ఈ శాసనము చదువులోకూడ వారు పుట్టిన మాసము మాసియని తలచ నవసరము లేదేమో. మారీచీపరిణయమునందు ఇవ్వబడిన రాయల జన్మదినము విశ్వసనీయము కాదనుటకు ఎట్టి ఆధా రమును లేదు. మారీచీపరిణయ రచనాకాలము (1518) నకు కృష్ణరాయలు వృద్ధుడని తెలుపబడియున్నది. (పద్య ములు, 25, 29). న్యూనిజు, కృష్ణరాయలు తనవృద్ధాప్యమున ఆరేండ్లవయసుగల తన కుమారుని సింహాసన మెక్కించెనని వ్రాసియున్నాడు.[48] శాసనాధారమున చారిత్రకులు ఈ కుమారునిపేరు తిరుమలరాయలనియు, అతని జననము 1518 లో అనియు, అతనిని రాయలు సింహాసనస్థునిచేయుట 1524 లో జరగియుండునని యు, నిర్ణయించినారు.[49] న్యూనిజు వ్రాతలను, శాసనాధారములను సమన్వయించి వేంకటరమ ణయ్యగారు కృష్ణరాయల జననము క్రీ.శ. 1474 లో యుండు నని, మిక్కిలి సమంజసముగా, మారీచీపరిణయమున ఇచ్చిన తేదీకి మిక్కిలి దగ్గరగా, ఊహించియున్నారు.[50]

మారీచీపరిణయమునందలి కృష్ణరాయల జన్మదినము ఒప్పు కొంటిమేని, రాయలకు, పట్టాభిషేకకాలము (7-8-1509) నాటికి 38 ఏండ్లు; పుత్రోదయమగు నాటికి 47 ఏండ్లు; 1924 లో తన కుమారుని సింహాసనసుని చేయునాటికి 53 ఏండు; అతడు, శాసనస్థమైన ఒక చాటువును [51] బట్టి, శా.శ. 1447 తారణ సంవత్సర జ్యేష్ఠశుద్ధ షష్టి ఆదివారము (కీ.శ.1525) లో చనిపోయినాడనుకొన్న, మరణకాలమునకు 54 ఏండ్లు; అట్లుగాక, శాసనాధారముగ క్రీ.శ. 1530 లో చనిపోయినా డనుకొన్న [52] మరణకాలమునకు 59 ఏండ్లు; [53] ఉండియుండ వలయునని తేలును.

11. వీరనరసింహరాయలు-కృష్ణరాయలు

కె. వి. లక్ష్మణరావుగారు ఇట్లు వ్రాసియున్నారు: "వీరనరసింహరాయని కంత్యకాలము సమీపించినప్పుడా తనికిఁ దిమ్మరాజను నెనిమిదేండ్లి కొమారుఁడుండెను. తాను పోయిన తరువాత దనపుత్రునకు రాజ్యమీయక కృష్ణ రాయలు తానాక్రమించు కొనునని తలఁచి, తన మంత్రియగు తిమ్మరుసును బిలిపించి, కృష్ణరాయని కనులుతీసి తనకుఁదెచ్చి చూపుమని యాజ్ఞాపించెనఁట. కాని యా మంత్రిపుంగవుఁడు కృష్ణరాయని డాఁచియుంచి మేక కనులు రాజునకుఁ జూపెనఁట. వీరనరసింహరాయలు మరణము నొందిన తరు

వాతఁ గృష్ణరాయఁడు తన తమ్ముఁడగు అచ్యుత రంగ రాయలను, అన్నకొమారుఁడగు తిమ్మరాజును చంద్రగిరి దుర్గమునిఁదికంపి, తాను పట్టాభిషిక్తుఁడయ్యెను." 54 చారిత్రకుల ఈ కథనమునకాధారము న్యూనిజ్ ప్రాతలు. న్యూనిజ్ ప్రకారము, తన తనయునకు తిమ్మరసు విషము పెట్టి చంపించినాడని తెలిసి, కృష్ణరాయలు తిమ్మసును పిలిపించి ఇట్లు చెప్పినాడట. "నేను నిన్నెప్పుడును నా పరమమిత్రుడుగ నెంచియుంటిని. నీవు నాకొసగిన ఈ రాజ్యమునకు, నలభై ఏండ్లుగ నీవు వ్యవహర్తగానున్నావు. కాని, దీనికై నేను నీకు ఋణపడియుండలేదు; ఏలనన, ఇట్లు చేయుటలో నీవు నీ విధిని నిర్వర్తించని వాడవై తివి. నీ ఏలిక యగు మాయన్న నాకండ్లు తీయించమని ఆదేశించినప్పుడు, అట్లుచేయుట నీ విధి. కాని నీవు అతని ఆజ్ఞను పాటించక, అవిధేయుడవై, మేక కండ్లను చూపించి, అతనిని వంచించి తివి. అతని ఆదేశమును నిర్వర్తించక పోవుటచే నీవును, నీతోపాటు నీ కుమారులును రాజద్రోహులైతిరి. ఇప్పుడు నీవును, నీ కుమారులును విషముపెట్టగా నా కుమారుడు మరణించెనని తెలియవచ్చినది. అందుచే మిమ్ముల బందీలను గావించుచున్నాను." 55

కాని మారీచీపరిణయమున ఎట్టి ఒడుదుడుకులు పొరపొచ్చెములు లేకయే, వీరనరసింహరాయల తర్వాత కృష్ణ

రాయలు రాజ్యమునకు వచ్చినట్లు చెప్పబడియున్నది. (పద్యము 67). మనుచరిత[56] పారిజాతాపహరణా[57]దు లలోగూడ అట్లే చెప్పబడియున్నది.

12. ఉదయగిరి ముట్టడి—ప్రచట కాపున్న గజపతి పినతండ్రి పేరేమి?

కృష్ణరాయలు దాదాపు 18 నెలలు ముట్టడి సాగించి నను ఉదయగిరి దుర్గము దుర్భేధ్యమై లొంగకపోయెను.[58] రాయలు దానిని ముట్టడించినపుడు అందు ప్రతాపరుద్ర గజపతి పినతండ్రి ఒకడు కాపుండి కడుసమర్థుడై ఎన్నాళ్ళ కును దుర్గమును లోబడనీయక కాపాడుచుండెను అంత నొకనాడు కృష్ణరాయడు "ఈ దినము గజపతి పినతండ్రి తల ప్రొక్కనిదే మాధ్యాహ్నికము నిర్వర్తించ"నని ప్రతిజ్ఞ చేసి ముట్టడి నడుపగా, గజపతిపినతండ్రి భయపడి దుర్గ మును లోబరచి తనతలకు మారుగా తనకిరీటమును పంపగా రాయలు దానిని ప్రొక్కి మాధ్యాహ్నికము గావించెనని యైతిహ్యము. ఈ విషయమే ఆముక్తమాల్యదా ప్రథమా శ్వాసాంతమున "ఇది కర్ణాట ధరాధృతి" అను పద్యమున చెప్పబడియున్నది.[59] ఈ గజపతి పినతండ్రి పేరునుగురించి భిన్నాభిప్రాయములు గలవు. వేదం వెంకటరాయశాస్త్రి గారు తమ ఆముక్తమాల్యదా - సంజీవనీవ్యాఖ్యలో ఇతని

పేరు ప్రహరేశ్వరుడని వ్రాసియున్నారు.[60] కాని కృష్ణ రాయల ఉదయగిరి శాసనమున "గజపతివారి పిన్నతండ్రి తిరుమలకాంతరాయని పట్టుకొని" అని స్పష్టముగా చెప్ప బడిఉన్నది.[61] దీనిని బట్టి గజపతిపినతండ్రి పేరు తిరుమల కాంతరాయలుగాని, ప్రహరేశ్వరుడుగాదని మనము నమ్మ వలసియుండును.[62] కాని రాయ శాసనములేవియు రాయలు గజపతి పిత్రవ్యుని కిరీటమును తొక్కిన విషయమును పేర్కొనవు. ఆముక్తమాల్యదయందే మూడవ ఆశ్వాసాంత పద్యమున, ప్రహరేశ్వర పాత్రుడు కొండపల్లి దుర్గాధిపతిగా నున్నట్లు తెలుపబడియున్నది;[63] రాయల తిరుపతి దేవస్థాన శాసన మొకటి ప్రహరేశ్వరుడు రాయలకు కొండపల్లియందు పట్టుబడినట్లు చెప్పుచున్నది.[64] ఈ ఆధారము లన్నిటినిబట్టి, గజపతి పిత్రవ్యుని నామము మనము తిరుమల కాంతరాయ లనియే గ్రహించవలసియుండును. కాని మారీచీపరిణయము (పద్యము, 75) రాయలు ఉదయగిరియందు ప్రహరేశ్వరుని వంచి, అతని కిరీటము కాలిపీటగా స్నానము గావించెనని చెప్పుచున్నది. దీనినిబట్టి ఊహించదగినదేమన, మారీచీ పరిణయకర మోహనాంగియే యైన, మనము ఉదయగిరి యందు రాయలు త్రొక్కినది ప్రహరేశ్వరుని కిరీటమే అని నమ్మటకు ఎక్కువ అవకాశముగలదు. బహుశా ఈ ప్రహరే శ్వరుడుగూడ గజపతి పిత్రవ్యులలో నొకడుగాబోలు; ఇతడు

గూడ ఉదయగిరియందు కాపుండి, అటుతర్వాత కొండపల్లికి తప్పించుక పోయివుండవచ్చును. కాని ఇది కేవలము నిరాధారమైన ఊహ. **మారీచీపరిణయమును** కృష్ణరాయలతరువాతి కాలమున ఎవరైన ప్రాసియుండిన, వారు కృష్ణరాయలకు తన కిరీటము నర్పించిన గజపతి పినతండ్రిపేరు ప్రహరేశ్వరుడని ప్రాయుట తెలియక చేసిన పొరపాటై ఉండవలయును.

13. బీజపూర్ పాలకుడు ఆదిల్ ఖాన్ మరణము

ఆముక్తమాల్యద కృత్యాదిలోని "అలుకన్ఘోటక ధట్టి కాఖురపుటీ.....కేదులఖానో గ్రకపాల మర్థపహారిచ్ఛా జాంగల శ్రేణికిన్" అను పద్యమును[65] బట్టి ఏదులఖాన్ (ఆదిల్ ఖాన్)ను కృష్ణరాయలు రణరంగమున వధించినట్లు తెలియుచున్నది. రాయలచే వధింపబడిన ఈ ఆదిల్ ఖాన్, ఇస్మాయిల్ ఆదిల్ షాహగాక, అతని తండ్రియైన యూసఫ్ ఆదిల్ ఖానుడని పండితులు నిర్ణయించినారు.[66] ఈ యూసఫ్ ఆదిల్ ఖాన్ తన 74 వ ఏట బీజపూరునందే జబ్బునపడి స్వాభావిక మరణము నందెనని మహమ్మదీయ చరిత్రకారుడు ఫెరిష్టా ప్రాసియున్నాడు.[67] కాని ఈ ఫెరిష్టా ప్రాసిన ప్రాతలు అసత్యములని రుజువుపరచి, నేలటూరు వేంకటరమణయ్యగారు, కోవెలకొండవద్ద 1510 లో బహమనీ సుల్తానుతోనైన

యుద్ధమున రాయలచే ఈ యూసప్ ఏదులఖానుడు హతు డాయెనని నిరూపించియున్నారు.[68] మారీచీపరిణయము కృష్ణ రాయలు బిజాపుర, గోలొ్కండ రాజ్యములతో చేసిన యుద్ధ ములను వేరొ్కని (పద్యములు 82,84), బిజాపుర పతా నుడు అనగా పాలకుడు ఏడిలఖానుడు కృష్ణరాయలచే "రంభ మేడకు" పంపబడెనని చెప్పుచున్నది (పద్యము, 83) మారీచీ పరిణయ రచన 1518 నాటికే జరగియుండుటచే రాయలచే నిహతుడైన ఈ ఆదిల్ఖానుడు, యూసఫ్ ఆదిల్ఖాను (1489_1510) డని మనము తెలియగలము.

14. కొన్ని అసందర్భములు

మారీచీపరిణయము (76 వ పద్యము)న కృష్ణరాయలు యుద్ధమునకు పిలుపనగా వీరభద్రుడు కనకగిరిని వసించునెడ తనకు మరణము తప్పదని భార్యాపుత్ర సమేతముగా వింధ్యా టవులకు పారిపోయెనని చెప్పబడియున్నది. వీరభద్రుడు ప్రతాపరుద్ర గజపతి కుమారుడు. కొండవీటి దుర్గమును ముట్టడించి కృష్ణరాయలు అతనిని సజీవముగ పట్టుకొన్నాడని రాయల శాసనములు,[69] పారిజాతాపహరణము,[70] ఆముక్త మాల్యద,[71] చెప్పుచున్నవి. న్యూనిజుకూడా కొండవీటియందు రాయలు గజపతి కుమారుని, గజపతి భార్యను బందీలు గావించెనని వ్రాసియున్నాడు.[72] కానీ మారీచీపరిణయ

కథనము ఈ వ్రాతలకు విరుద్ధముగనున్నది; అంతేకాక అసందర్భముగను, అర్థరహితముగనుండి, ఈ కావ్యము మోహనాంగి వ్రాసినదేనా అను సంశయమును వృద్ధిచేసి, దానికిగల చారిత్రక ప్రామాణికతను అనుమానాస్పదము గావించుచున్నది. కొండవీడుకు కనకగిరి సంస్కృతీకరణము కాజాలదు. కనకగిరి తెలంగాణా దుర్గము; ఆ నాడది తురుష్కుల పరిపాలనలో ఉండినది; దానిని కృష్ణరాయలు తన పూర్వ దిగ్విజయ యాత్రలో జయించినట్లు, "కనకగిరి స్ఫూర్తి గర చె" అని పెద్దన చెప్పియున్నాడు.[73] ఈ కనకగిరిని వీరభద్రుడు పరిపాలించినట్లు చరిత్రకు తెలియదు. వీరభద్రుడు కనకగిరినుండిగాని, కొండవీడునుండిగాని వింధ్యాటవులకు పారిపోవుటయు సాధ్యము గాదు. కృష్ణరాయలు యుద్ధమునకు పిలచినను రానివాడు ఓఢ్రప్రభువు (ప్రతాపరుద్ర గజపతి) అని న్యూనిజ్ వ్రాసియున్నాడు.[74] **మారీచీపరిణయము** (77 వ పద్యము)న ఇట్లు రణమునకు వెరచి వింధ్యాగుహాంతరంబుల తలదాచుకొన్న వీరభద్రుడు కృష్ణరాయలకు మణులను, నిజాత్మజామణిని తెచ్చి ఇచ్చుటవలన, వింధ్యభూముల యందలి భిల్లదొరలు అతనిని తొల్లిటి జాంబవంతునిగా గణుతి యొనర్చి కొలిచిరని చెప్పియున్నది. ఈ పద్యమునందు చెప్పిన కార్యము చేసినవాడుగూడ వీరభద్రుడుగాక అతని తండ్రియైన ప్రతాప

రుద్రగజపతియే. ప్రతాపరుద్రుడు కృష్ణరాయల ధాటికాగ లేక వింధ్యాటవులకు పారిపోయినాడనియు, కూతునిచ్చి అతనితో సంధిగావించుకొనినాడనియు అముక్తమాల్యదా,[75] రాయవాచకాది[76] విజయనగరవాఙ్మయము వలన, న్యూనిజ్ఞాతాల[77] వలన మనము తెలుసుకొనుచున్నాము. కావున మనకు తెలిసియున్న ఈ చారిత్రక సత్యములకు సరిపోవలెనన్న, మారీచీపరిణయ పద్యములలో "వీరభద్రు"డను పదమును "వీరరుద్రు"డని మార్చిన సరిపోవును. "వీరరుద్రు"ని "వీరభద్రు"డనుట లేఖక దోషమేమో. 81 వ పద్యమునందు స్పష్టముగా, కృష్ణరాయలచే భంగపడిన ప్రతాపరుద్రుడు, దీనుడై, అతనికి తన కూతును లక్ష్మీయను దానినిచ్చి సంతోషపెట్టెనని చెప్పబడియున్నది.

కాని, "వీరభద్రు"నకు "వీరరుద్రు"డని పైన సూచించిన మార్పునకు, 90 వ పద్యము ప్రతిబాధకముగానున్నది. ఈ పద్యమున తెనుగురాజై నరపతిత్వము కలిగిన వీరభద్రుపుత్రిని, ఒడ్డెరాజై గజపతిత్వము గలిగిన ప్రతాపరుద్రుని పుత్రిని, కృష్ణరాయలు పెండ్లియాడి, అశ్వపతియైన తురకరాజు కూతును పెండ్లియాడక పంక్తి పక్షపాతము చూపినాడని చెప్పిబడియున్నది. దీనినిబట్టి కృష్ణరాయలు ప్రతాపరుద్రుని పుత్రికనేగాక, అతని పుత్రుడు వీరభద్రుని పుత్రికను గూడ వివాహము చేసుకొన్నాడని స్పష్టమగుచున్నది.

అనగా రాయలు గజపతి తనయనేగాక, ఆమె అన్న వీర భద్రుని కూతురునుకూడా పెండ్లిచేసుకొన్నాడన్న మాట. ఇది కొంత లోకాచారమునకు విడ్డూరముగ దోచినను, వావి వరుస తప్పి చేసుకొన్న వివాహముగాదు. భార్య అన్న కూతురు వివాహమునకు వరుసయే అగును. వీరభద్రుడు తన తండ్రి ప్రతినిధిగా, కొండవీడు రాజధానిగా తెలుగు దేశము నేలినది నిజము. తెలుగుదేశ ప్రభువులకు నరపతి బిరుదమున్నది గూడా నిజము.[78] కాని ప్రతాపరుద్ర గజపతి కొడుకైన వీరభద్రుడు తన శాసనములలో కొన్ని గజపతుల బిరుదములను వాడియున్నాడేకాని,[79] నరపతి బిరుదమును వాడియుండలేదు. ఈ బిడ్డ వీరభద్రుడుగాక, మరెవరైన వీరభద్రుడు తెలుగుదేశము నేలినాడాయన్న అట్లు తెలియరాదు; ఆరవీటి వంశజులను నరపతి వంశజులందురు. ఈ వీరభద్రుడేమైన ఈ నరపతి వంశమునకు చెందినవాడా యనిన, ఈ నరపతి వంశజులను గురించి చెప్పు **నరపతి విజయము**,[80] **బాలభాగవత**[81] కావ్యములందు ఈ పేరే కానరాదు. **రాయవాచకమున** విజయనగర రాజులకే "**నరపతు**" లని వాడబడియున్నది.[82] ఈ "వీరభద్రతనయ" సమస్యా పరిష్కారము భావిపరిశోధనకు వదలి, ప్రస్తుతమునకు మారీచీ **పరిణయము** (.90 వ పద్యము)న చెప్పినట్లు, రాయలు ప్రతాపరుద్రుని తనయను, వీరభద్రుని తనయను, ఇద్దరిని

గూడ వివాహమాడినట్లు తలచి, రాయల దేవేరులను గురించి కొంత ఆలోచించెదము.

15. రాయల దేవేరులు : గజపతి కూతురు పేరేమి?

కృష్ణరాయల **ను**ద్దేశించి "తిరుమల దేవీవల్లభ" "చిన్నమదేవీ జీవితనాయక" అని **పారిజాతాపహరణము** [83] నందును, కృష్ణరాయలగూర్చి దేవేరు**లు** తిరుమలదేవి, చిన్నాదేవియని **మనుచరిత్ర** [84] యందును చెప్పబడి, **ఆము క్త** మాల్యద యందు రాయల దేవేరులలో చిన్నాదేవిపేరు చెప్పబడక పోవుటచే, [85] **ఆము క్తమాల్యద**, లేక **ఆము క్తమాల్యదా** కృత్యాది పూర్తియగు నాటికి (.1518), ఆమె చనిపోయి ఉండవలయునని పండితులు అభిప్రాయపడుచున్నారు. ఆమె 2-1-1517, 1-12-1517 ల మధ్య చనిపోయిఉండవచ్చునని, శాసనాధారమున, పైన నిరూపించియుంటిమి. [86] **మారీచీపరి ణయమున** ఒక వచనము (17) న రాయలు "దిరుమల దేవీ హృదయ ప్రియుండును," "జిన్నాంబా మనోహరుండును" అని సంబోధింపబడి యుండుటచే, **మారీచీపరిణయ** రచనా ప్రారంభకాలము (2-1-1517, 1-12-1517 ల మధ్య)నాటికి చిన్నాదేవి బ్రతికియున్నదనియే మనము తలచవలెను. కాని **మారీచీపరిణయ** రచనాకాలమునాటికి **ఆము క్తమాల్యదా**

రచన పూర్తియైనట్లు ఆ కావ్యమునందు సూచింపబడినది (పద్యము, 10). **ఆముక్తమాల్యద** తర్వాత రచింపబడిన **మారీచీపరిణయము**నందు చిన్నాదేవిపేరు పేర్కొనబడగా, **ఆముక్తమాల్యద**యందు చిన్నాదేవిపేరు కానరాక పోవుట సమస్యగా పరిణమించును. దీనికి సమాధానము - **ఆముక్త మాల్యదా**కృత్యాది, ఆ కావ్యరచన యంతయు పూర్తియైన తరువాత చేర్చినది. రాయలు **మనుచరిత్ర** యందలి కృతిపతి ప్రశంసా పద్యములనే అవసరమైన అలతి మార్పులతో **ఆముక్తమాల్యదా** కృత్యాది పద్యములుగ చేర్చుకొన్నాడు. ఇట్లు చేర్చుట, 1-12-1517 కు కొంత ఇటు నటుగా జరిగియుండవలయును. అప్పటికి చిన్నాదేవి చని పోయినది. అందువలననే, **మనుచరిత్ర**లో తన దేవేరులను గురించి తెల్పు.

ఆవిభు ననంతరంబ ధ
రావలయము దాల్చెఁగృష్ణరాయఁడు చిన్నా
దేవియు శుభమతి తిరుమల
దేవియునుం దనకుఁగూర్చు దేవేరులుగాన్.[87]

అను పద్యమును, రాయలు, చిన్నాదేవి మరణమును మనసు నందుంచుకొని, కొంత మార్చి, **ఆముక్తమాల్యద**లో

ఆవిభు ననంతరంబ ధ
రావలయము బూనితీవు రహిమై దిరుమ

లేవియును నన్న పూర్ణా
దేవియుఁ గమలాబ్జముఖియు దేవేరులుగాన్.88

అని వ్రాసినాడు. పేయజ్ కృష్ణరాయనికి 12 గురు ధర్మ పత్నులు గలరనియు, వారిలో ముగ్గురు మాత్రమే పట్ట మహిషిణులనియు, ఆ ముగ్గురిలో ఒకతె ఓఢ్ర రాజు కూతు రనియు; మరియొకతె యౌవనమున అతనికి ప్రియురాలుగా నున్న వేశ్యఅనియు, మిగిలినవారు రాయల సామంతుడైన శ్రీరంగపట్టణ పాలకుని కుమార్తెలు (and others daughters of a king his vassal who is King of Serimgapatao). అనియు చెప్పియున్నాడు.89 న్యూనిజు కృష్ణరాయలకు భార్యలు నలుగురనియు, వారిలో 'నరసింగ' రాజుల వంశమున చెందిన సౌందర్యవతి ఒకతె అనియు, తాను యౌవనమున రాజుగాకముందే ప్రేమించిన చిన్నాదేవి యను వేశ్య మరియొకతె యనియు, వీరిలో వేశ్యయైన చిన్నాదేవిమీద అతనికి అధికప్రేమ అనియు వ్రాసి యున్నాడు.90 మారీచీపరిణయమున రాయల భార్యల పేర్లు తిరుమలాంబ, చిన్నాంబ, అన్నపూర్ణాంబిక, లక్ష్మిఅని చెప్ప బడియున్నవి.91 వీరిలో లక్ష్మి గజపతి ప్రతాపరుద్రుని పుత్రికయని 81 వ పద్యమున స్పష్టముగా తెల్పబడినది. కొంతమంది ఈ గజపతికూతురుపేరు అన్నపూర్ణ అన్నారు కాని, మారీచీపరిణయమును బట్టి లక్ష్మి, అన్నపూర్ణలు వేరు అని తెలియనగును. గజపతి కూతురుపేరు లక్ష్మియనుటకు

ప్రమాణాంతరములు గలవు. గజపతి తనయపేరు "లక్ష్మీదేవమ్మవారు" అని వెంకటపతిరాయల ఆదేశము మీద శా. శ. 1526 సంవత్సరమున ప్రాసిన విజయనగర సామ్రాజ్యదవు లేక కృష్ణరాయ అభిదవివరవు అను కడితల్లో చెప్పబడియున్నది.[92] అట్లే, శా. శ. 1439. ఈశ్వర సం॥ మార్గశిర బ. ఏ. (1-12-1517) నాడు రాయలమంత్రి కొండమరుసయ్య వేయించిన చోళసముద్ర శాసనమున "కృతయుగాంశ ప్రవర్తక శ్రీ తిరుమలాంబికా లక్ష్మీ సమేత శ్రీకర్ణాటక సింహాసనారూఢ శ్రీ కృష్ణరాయ మహారాయర సామ్రాజ్యదల్లి" అని, తిరుమలాంబా, లక్ష్మీదేవులు రాయల దేవేరులుగా పేర్కొనబడియున్నారు.[93] అముక్తమాల్యద యందును గజపతి తనయపేరు లక్ష్మీయని ధ్వనించు పద్య మొకటిగలదు.[94] గజపతి తనయపేరు నిస్సంశయముగా లక్ష్మీదేవియే. ఈమెపేరు కృష్ణరాయవిజయమునందు తుఖ్మా యనియు,[95] రాయవాచకమున[96] జగన్మోహిని యనియు, నాదెండ్ల గోపమంత్రి ప్రబోధచంద్రోదయవ్యాఖ్య యందలి ఒక శ్లోకమునుబట్టి భద్ర అనియు,[97] Taylor దొర గారిచే రుచీదేవి యనియు,[98] కొన్ని కథలలో వరదరాజమ్మ అనియు, అన్నపూర్ణ అనియు అనేక విధములుగ ఊహింపబడినది.[99] కాని ఇవి ఊహలు మాత్రమే. బహుశా వీనిలో

'తుఖ్కా' ఒరియాలోని 'లఖ్కా' (లక్ష్మి, తెలుగులో లక్క మాంబవలెకు పొరపాటై యుండవచ్చును.

కృష్ణరాయలు అన్నపూర్ణయందు వెంగళాంబను కనె నని **మారీచీపరిణయము** చెప్పుచున్నది (పద్యం, 92). ఈ అన్నపూర్ణ ఎవరు? ఓడ్ర భాషలలోనున్న చారిత్రక గ్రంథములలో గజపతిపుత్రి పేరు అన్నపూర్ణాదేవియె అని యున్నట్లు తెలియుచున్నది అని చాగంటి శేషయ్యగారు వ్రాసినారు.[100] **మారీచీపరిణయమున** కృష్ణరాయలు వీరభద్రుని కూతునొకతె పెండ్లియాడెనని చెప్పబడియున్నది. కాని ఆమె పేరు చెప్పబడి యుండలేదు. అన్నపూర్ణ ఈ వీరభద్రుని తనయ కాదుకదా? ఇదే నిజమయిన, ప్రతాపరుద్రుని తనయ లక్ష్మిని, ప్రతాపరుద్రుని తనయుని తనయ అన్నపూర్ణను, ఇద్దరిని గజపతి తనయలనుటలో అసందర్భమేమియులేదు. ఈ వాదనాసరళిని ఒప్పుకొంటిమేని, **అముక్త మాల్యదా** కృత్యాదిలో **పేరొ**క్కనబడిన రాయల దేవేరులు "తిరుమల్దేవియును, నన్నపూర్ణాదేవియును, గమలాబ్జముఖియు" అను వారలను క్రమముగా శ్రీరంగపట్న పాలకుని కూతురు తిరుమలాంబగను, వీరభద్ర గజపతి కూతురు అన్నపూర్ణగను, గజపతి ప్రతాపరుద్రుని కూతురు లక్ష్మి (కమలాబ్జముఖి - కమలయనెడు అబ్జముఖి)గను మనము గుర్తించవచ్చును. కాని **మారీచీపరిణయము** నందొసగబడిన వీర

భద్రుని వర్ణన (పద్యములు, 76, 77, 90) అన్నపూర్ణ వీరభద్రుని కూతురని చెప్పుటకు దోహదకారిగలేదు. పెయజ్ కృష్ణరాయలు శ్రీరంగపట్న పాలకుని కూతుం ద్రను (అనగా ఒకరిని మించి) పెండ్లియాడెనని చెప్పు చున్నాడు. అన్నపూర్ణ వీరభద్రుని కూతురు కాని యెడల, తిరుమలాంబతోపాటు, శ్రీరంగపట్న పాలకుని కూతులలో నొక తైయై యుండవచ్చును. భావిపరిశోధనలో ప్రమా ణాంతరములు దొరకిన గాని **మారీచీపరిణయమునందు** తెల్ప బడిన ఈ అంశముల సత్యాసత్యములు నిర్ధారించుటకు వీలు లేదు.

♦ ♦ ♦ ♦ ♦

మారీచీపరిణయము పైన చర్చించబడిన వివాదాంశ ములపై కొంత వెలుగును ప్రసరించుటయేగాక, విజయనగర చరిత్రలో నిర్వివాదాంశములుగ ఎన్నబడు ఎన్నో విషయ ములకు ఇతోధిక ఉపపత్తులను సమకూర్చుచున్నది. ఈ **మారీచీపరిణయము** మోహనాంగీ కృతమేనని మనము రుజువు పరచగలిగినచో, చారిత్రకముగా దీనికిగల విలువ అమూల్యమై, దీని ఆధారముగ విజయనగర చరిత్ర రచ నలో కొన్ని మార్పులు, చేర్పులు చేయవలసిన అగత్య మేర్పడగలదు. ఇది మోహనాంగీ కృతము కాదనుకొన్న ప్పటికి, మొదటనే నేను మనవి చేసినట్లు, నేటికి అధమ

షష్టము 200 ఏండ్లుగా తెలుగువారి ఎరుకలోగల కావ్యముగా, దీనికి చారిత్రకముగాగల విలువ, రాయవాచక, కృష్ణరాయవిజయాది విజయనగర చారిత్రకాధారముల కన్నను తీసిపోవునదికాదు.

చరిత్ర విద్యార్థుల సౌలభ్యమునకై ఈ కావ్యమున నేటికి లభ్యమైన చారిత్రకాంశములు, పద్యక్రమమున, సంగ్రహముగా, అనుబంధ రూపమున, ఇచ్చియున్నాను.

కావుటూరు వేంకటరామచంద్ర రావు

'మకరసంక్రాంతి'
14-1-73
"మానస"
నెల్లూరు-3.

వివరణాలు

1. ఈ కావ్యపుటునికి సాహిత్యవేత్తల ఎరుకలో చాల కాలముగ నున్నది.

ఉదాహరణకు:-ఈ క్రింది సాహితీవేత్తలు తమ వ్యాసము లలో, రచనలలో మోహనాంగిని, - **మారీచీపరిణయమును** పేరొకొని యున్నారు.

(i) రామచంద్రరావు తేకుమళ్ల, "ఆంధ్రరాజ కవులు," **భారతి**, 1929, జూలై, పుట. 30.

(ii) భూషణ్. వి-యన్;"Some Women poets of Ancient Andhra" *Triveni*, **1932**. V. 2, పుట. 153.

(iii) ప్రభాకరామాత్య వెల్దండ, **ఆముక్తమాల్యదా పర్యాలోకనము**, (1945); పు. 24. ప్రభాకరామాత్య **ఆముక్తమాల్యద** కావ్యగుణములను వర్ణించుచు **మారీచీపరిణయమునందలి** 10 వ పద్యమును ఉద్ధృత మొనర్చి యున్నారు.

(iv) లక్ష్మీకాంతమ్మ, ఊటుకూరు, **ఆంధ్రకవయిత్రులు**, (1953).

(v) నారాయణాచార్యులు, పుట్టపర్తి, **వ్యాససౌరభము** (1964), పు. 110 లో 'రాయలవారికొక బిడ్డ

యుండెడిది. ఆమె పేరు తిరుమలాంబ. "మోహనాంగి" యనియు మారుపేరు ఆమె చక్కని కవయిత్రియు.' అని వ్రాసినారు.

రామకృష్ణకవి మోచర్ల (సం): కవికర్ణరసాయనము (సంకుసాలనృసింహకవి ప్రణీతము) (హైదరాబాదు, 1967), ఉపోద్ఘాతము, పు. xvii-xxii; రామకృష్ణకవిగారు **మారీచీపరిణయము**నందలి 10,13,14,15,17, 18,93, పద్యములను ఉద్ధృత మొనరించియున్నారు.

2. **ఆంకత**, VII, పు. 235-236.

సఆంసా, VII, పు. 216.

3. సెవెల్ రామరాయలు, అతని తమ్ముడు తిరుమల రాయలు కృష్ణరాయని కూతుండ్రను పెండ్లి చేసుకొన్నారని చెప్పియున్నాడు. చూడు, *FE*, పు. 169, అ. సూ. 1,3, పే. 180, 181, 182. పు. 367. అ. సూ. 5; సెవెల్ ఈ తిరుమల రాయని భార్య చిన్నాదేవి కూతురని సూచించియున్నాడు. (చూడు *Antiquities*, **II**, పు. 248. సెవెల్ ననుసరించియే కాబోలు, హయవదనరావుగారు వెంగళాంబ చిన్నాదేవి కూతురని వ్రాసినారు, చూడు *Mysore Gazetter*, *Vol. II, Part-III*, పు. 1959. వెంగళాంబను గురించి గురించి, చూడు. **వసు**, I, 62, 63, 64.

4. ఆంకత, VII, పు. 53.

కృష్ణరాయల అల్లుడైన ఈ మట్ల వరదరాజును గురించి చూడు. *AR* of 1920, Part II, Para 49.

5. **రాయవాచకము** 16 వ శతాబ్దపు తృతీయ పాదమున కళింగదేశమును పరిపాలించిన గజపతి ముకుందబాహు బలేంద్రుని పేర్కొనియున్నది. అట్లే గోల్కొండ నవాబు మహమ్మద్ కులీకుతుబ్ షా (1580-1611) చే నిర్మింపబడిన భాగ్యనగరమును పేర్కొని యున్నది. ఈ భాగ్యనగర (నేటి హైదరాబాదు) నిర్మాణము. 1592. ప్రాంతమున పూర్తిగావింపబడినది. (చూడు, Sherwani, *Muhmmad-Quli Qutb shah,* (1967), పు. 14. అందుచే **రాయవాచక** రచనాకాలము 17 వ శతాబ్ద ప్రారంభమున ఉండవచ్చును.

కుమార ధూర్జటికవికృత **కృష్ణరాయవిజయము**, అలతి మార్పులతో **రాయవాచకమున**కు పద్యప్రతి. క్రీ.శ. 1630-1642 ల మధ్య కర్ణాటక సామ్రాజ్యమును పాలించిన ముమ్మడి వేంకటపతిరాయల కాలమున రచింపబడెను. చూడు, భారతి, 1948, ఫిబ్రవరి, పు. 64-65.

6. న్యూనిజ్ కథనమునకు చూడు *FE*, పు. 359 కృష్ణ రాయల పుత్రుడు తిరుమలరాయలకు సంబంధించిన

శాసనములకై చూడు.

EC, IV, HS, 58.

EC, IX, Magadi, 82 dated 1524.

EC, IX, Magadi, 6 dated 1524.

MER, 1896, Appendix, B. No. 139.

MER, 1923, Para 79, Appendix. B No. 683.

MER, 1923, Appendix B. No. 697 dated 1519.

SII, IX, ii, No. 507. dated 1518, Oct, 30.

AR, 115, 116, 117 of 1918.

AR, 91 of 1912.

7. *FE*, పు. 366-67. లు.

8. కూటో, VI. పు. 382-హెరాన్, *Aravidu Dynasty*, Vol. I. పు. 13. అ. సూ. 2 యందు సూచించ బడ్డట్లు.

9. శా. శ. 1439 ఈశ్వర మార్గశిర బ. 3 (డిశంబరు 1, 1517) నాడు రాయసం కొండమరసయ్య కృష్ణరాయ లకు సంతానాభివృద్ధి కోరుచు, "కృష్ణరాయమహా రాయరిగె సంతానాభివృద్ధి యాగబేకె" అని చోళ సముద్రమున (అనంతపురంజిల్లా) దానశాసనము వేయించిఉన్నాడు (*SII*, IX, ii, 507). ఇచట సంతాన మనగా పుత్రసంతానమని అర్థము చేసుకొన

వలెను. విజయనగరమున శా. శ. 1459 బహు ధాన్య కార్తిక శు (బ?) 12 (30 అక్టోబరు 1518) నాడు కృష్ణరాయల పట్టపుమహాదేవి తిరుమలదేవమ్మ తిరుమలదేవమహారాయలకు పుణ్యముగా భూదానము చేసెను. (*SII*, IX, ii, 5 10). తరువాతి శాసనము లందు తిరుమలదేవమహారాయలు కృష్ణరాయల పుత్రుడని తెల్లము సేయబడియున్నది. (ఈ శాసన ములకు పైన **వివరణ.** 6 చూచునది): కావున కృష్ణరాయలకు తిరుమలదేవియందు శ. 1440. సరి యైన క్రీ. శ. 1518 వ సం॥న తిరుమలదేవరాయ లను పుత్రుడు కలిగినట్లు నిశ్చయించడమైనది. (చూడు. **భారతి**, 1953, మే, పు. 399.)

10. **అముక్తమాల్యదా** రచనాకాల నిర్ణయమును గురించి, పైన, ప్రస్తావన, శీర్షిక. 5 క్రింద చూచునది.

11. *TTDI*, III, No. 80.

12. *SII*, IX. ii, No. 507.

13. **అంకచ**, 2 వ భాగము, "కృష్ణరాయలు." శీర్షిక క్రింద చూచునది.

14. **ల వ్యా**, పు. 34-35 లు.

15. **ఆం సా ప ప**, సం. 24, సంచిక. 4, పు. 121.

16. *Studies in Kṛṣṇadëvarāya*, పు. 121.

17. ఆంధ్ర, VII, పు. 132.

18. *SII*, VI, No. 696.

19. *SII*, VI, No. 695.

20. *TTDI*, III, No. 80.

21. ప్రస్తావన, శీర్షిక, 4 క్రింద చూచునది.

22. *SII*, IV, 981; లవ్యా, పు. 33-34 లు.

23. *SII*, VI, 695.

24. మను, I. 37.

25. చూడు. Venkataramanayya, N., "The kingdom of Vijayanagara." *HCIP*, VI, P. 313; మరియు, "కృష్ణదేవరాయలు - కళింగ జైత్రయాత్ర - 4," భారతి, జూలై, పు. 45-50; "విజయనగర సామ్రాజ్యము," విజ్ఞానసర్వస్వము, III, పు. 390-391; Subrahmanyam, R., *The Sūryavamsi Gajapatis of Orissa*, పు. 115-117; Nilakanta Sastri & Venkataramanayya, *Further Sources*, I, 209-211 Mukherjee. P. *Gajapati kings*, 93-95.

26. *AR*, No. 824 of 1922.

27. *SII.* VI. 695.

28. ఈ చర్చల సారాంశమునకై చూడు, వేంకటరమణయ్య, నేలటూరు, **వాఙ్మయవ్యాసమంజరి**, "తెనాలి రామకృష్ణకవి," పు. 93-102;

29. వివిధ పరిశోధకులు అంగీకరించిన అష్టదిగ్గజ కవుల పట్టికలకై, చూడు. **స ఆం సా**, VII, పు. 134; ప్రభాకరామాత్య, వెల్దండ: **ఆముక్తమాల్యదా పర్యాలోకనమునకు** ఈయుణ్ణి రాఘవాచార్యుల వారి భూమిక, **ఆంధ్రసాహిత్య సారభము**, పు. 22;

30. వేంకటరమణయ్య, నేలటూరు: **వాఙ్మయ వ్యాస మంజరి**, "తెనాలి రామకృష్ణుడు." పు. 123; కాని ఈ గ్రంథమునందే, పుట. 102 లో "కావున పాండురంగ మహాత్మ్య రచనాకాలము క్రీ. శ. 1570 కి తరువాతనే యని తలచుట సమంజసము" అని రమణయ్యగారు వ్రాసియున్నారు.

31. కావలి వెంకటరామస్వామిగారు తమ *Dekkan Poets.* (1829) లో రామకృష్ణుని జననమును గురించి ఈలా వ్రాశారు. "He was born in the village of Tennala in A. S. 1384 and was of the family of Iswer Pragada; his horoscope exhibits him as born under a very propitious star." (P. 53)

ఈ వ్రాతనుబట్టి రామస్వామిగారో లేక వారి నివే దకుడో (Informant) రామలింగని జాతకాన్ని గూడా చూచినట్లు మనం అనుకోవాలి. ఈ జన్మ దినం. శా. శ. 1384 లేక, క్రీ. శ. 1462 ప్రకారం, మారీచీపరిణయంలోనే చెప్పబడ్డ కృష్ణరాయల జన్మ దినం 17-1 1471 (పై, ప్రస్తావన, శీర్షిక, 10 క్రింద చూచునది.)నిబట్టి, రామకృష్ణుడు కృష్ణరాయలకన్న వయసున పదేండ్లు పెద్దవాడు. పాండురంగ మాహా త్మ్యము పూర్తిచేయునాటికి సుమారు 50-55 ఏండ్ల వాడుగ ఉండియుండవలయును.

32. చూడు- అనుబంధము.-చారిత్రకాంశముల సంగ్ర హము.

33. మను, I, 21, 22.

34. పారి, I, 8. ; I, 11 లో తిమ్మన కృష్ణరాయలు యాదవాన్వయుడని చెప్పినాడు. ఈ యదువు తుర్వ సుని అన్న.

35. జైమినిభారతము, I, 26-51 ; *Sources*, పు. 29-30 లు.

36. *Sources*, 88-90.

37. చూడు. వేంకటరమణయ్య నేలటూరు, భారతి, 1949, ఏప్రిల్, పు. 158, 161 లు; *EC.* X-Gori, 77.

38. ల మ మ, పు 397.

39. ఆదే, పు. 389.

40. ఆం క చ. - నందిమల్లయ, ఘంట సింగయల జీవిత చరిత్రముల క్రిందచూచునది.

41. చూడు. AR, 1919, Part II, Para-42; *EC*, V, Hn-19; *HISI*, P.241.

42. *Sources*, పు. 108-109 లు.

43. స్వామికణ్ణుపిళ్లైగారి ఎఫిమెరిస్ చూచి ఈ జన్మదిన మునకు సరియైన క్రీస్తుశక దినము నాకు తెల్పినవారు మా మిత్రులు, నిరంతర పరిశోధకులు, శ్రీనేల నూతల శ్రీ కృష్ణమూర్తిగారు. క్రింద వివరణం. 45 చూచునది.

44. ఈ చాటువునకై చూడు. ఆం క త, VII, పు. 16.

45. ఈ చాటువునుబట్టి తేలు కృష్ణరాయల జన్మదినమును బొబ్బిలి సంస్థాన జ్యోతిష్కులు కొటికలపూడి యజ్ఞేశ్వర నరసింహశర్మగారు గుణించి శ్రీ వేటూరు

ప్రభాకరశాస్త్రులవారికిన్వగా వారు దానిని **భారతి**, 1926 సెప్టెంబరు, పు. 89-91 లలో ప్రచురించిరి. నరసింహశర్మగారి గణన ప్రకారము విక్రృతి సంవత్సర పుష్యబహుళ ద్వాదశి 18-1-1471 అగుచున్నది. ఆ రోజున ద్వాదశి సూర్యోదయాది పది గడియల వరకును, పూర్వాషాఢ నక్షత్రము అరువది ఘడియల వరకును ఉన్నదని వారు తెలుపుచున్నారు. (రాయలవారి జన్మనక్షత్రము జ్యేష్ఠానక్షత్రమని చెప్పబడియుండుటచే, వారు 17-1-1471 నాడే జన్మించిరని చెప్పవచ్చును.)

నరసింహశర్మగారు వీరేశలింగముగారు ఇచ్చిన ఈ చాటువులోని "శకాబ్దముల ద్రివసు త్రిసోములన్." అను భాగమును "శకాబ్దములన్ ద్వినవత్రి సోములన్" అని, జ్యోతిష్య ప్రమాణకాల్య సవరించ వలసియుండునని తెల్పియున్నారు.

46. *NDI*, **III, Sulurpeta, 11.**

47. చూడు. *AR*, **1916. Part, II, Para. 66.**

48. *FE*, పు. 359.

49 **భారతి**, 1953, మే, పు. 399-400 లు.

50. **అదే**, 1949, మార్చి. పు. 285 ; కృష్ణరాయని జన్మ దినమును గురించిన చర్చలకై, **సఆంసా**, VII, ప్ర. 76. కూడా చూచునది.

51. ఈ చాటువు శా. శ. 1448 చైత్ర శు. 12 సోమ వారమునాడు వ్రాయబడిన అళియరామరాజు తామ్ర శాసన మొకదానియందుగూడ ఉదాహరింపబడినది. చూడు. శివశంకరంపిళ్లై. టి, "విద్యానగర శాసన ములు," **భారతి**, 1927, జూలై, పు. 89-96 లు ; *AR*. No. 12 of 1946-47.

52. కృష్ణరాయలు క్రీ. శ. 1530 లో చనిపోయినాడను కొనుటకు ఆధారములైన శాసనములు, వాని సారాం శమునకు, చూడు. *Mysore Gazetter*, Vol. II, Part III, పు. 1966 ; *AR*, No. 512 of 1919 ; *AR* No. 15 of 1915 ; *AR* No. 14 of 1915; *HISI*, పు. 245; *EI*, XIV, 168 ; *NDI*, I, పు. 362.

53. కావలి వెంకటరామస్వామి తన *Dekkan Poets*, పు. 79 లో. కృష్ణరాయలు తన నలువదవపేట శా. శ. 1446 (క్రీ. శ. 1524) లో చనిపోయినాడని వ్రాశినారు. కాని, **మారీచీపరిణయమునందును**, న్యూనిజు వ్రాతలందును కృష్ణరాయలు తన 40 వ

ఏటనే చనిపోయిఉండిన అతనిని వృద్ధుడని చెప్పటకు వీలులేదు.

54. అమము; పు. 403.

55. *FE*, పు. 359-360.

56. మను, I. 33.

57. పారి, I. 16.

58. *FE*, పు 316.

59. ఆముక్త, I, 89.

60. అదే, పు, 90.

61. *NDI*, III, పు. 1367.

62. ప్రతాపరుద్ర గజపతి పినతండ్రి వాస్తవనామమును గురించిన చర్చకై, చూ. వెంకటరమణయ్య నేలటూరు, "కృష్ణదేవరాయలు," భారతి, 1952, జూలై, పు. 34, అ. సూ. 3.

63. ఆముక్త, III, 93.

64. *TTDI*, III, No. 80.

65. ఆముక్త, I, 42.

66. చూడు. వెంకటరమణయ్య నేలటూరు, భారతి,

1949, ఆగష్టు పు. 189-190. లు ; ఆంధ్ర పు. 35-41. లు.

67. Briggs, III, పు. 17-18.

68. భారతి, 1949. ఆగష్టు, పు. 183-192 లు.

68. *TTDI*, III. No. 71.

70. పారి. I. 21.

71. ఆముక్త, II. 101.

72. *FE*, పు318-319 లు. న్యూనిజు గజపతి కొమారుడు కొండపల్లియందు పట్టుబడెనని వ్రాసియున్నాడు. ఇది పొరపాటు. కృష్ణరాయలచేత పట్టుబడిన తర్వాత, వీరభద్రుడు రాయలకొలువునచేరి అతని పక్షమున కొన్ని సీమలను పరిపాలించుచున్నట్లు తెలియవచ్చుచున్నది. విజయనగర రాజ్యమున వీరభద్ర గజపతి శాసనములు మూడు గలవు. (*EC*, XI. Dg. 107, XII. Pg. 62; *AR*, 744 of 1917). ఇవి అన్నియు శా. శ. 1447. యువసంవత్సర కార్తికమాస శుక్ల పక్షమున వ్రాయించినవి. రాయలు కులీనుడు కాని వానితో కత్తిసాము ప్రదర్శించమని వీరభద్రుని ఆదేశించగా అతడు అవమానితుడై ఆత్మహత్య చేసు

కొనెనని న్యూనిజు తెలుపుచున్నాడు (*FE*, 319-320). పెయిజ్ అతడు చిరకాలము రాయలచే కారాగారమునందుంచబడగా, అతడచటనె మృతినందెనని తెలుపుచున్నాడు. (అదే, పు. 247). రాయలచే పట్టుబడిన తర్వాత, ఈ వీరభద్రుని చరిత్రమునకై చూడు. వెంకటరమణయ్య నేలటూరు, "కృష్ణదేవరాయలు," భారతి, 1952, జూలై, పు. 48-49.; Subrahmanyam, R. *The Sūryavaṁsi Gajapatis of Orissa*. పు. 113-115 లు.

73. మను I, 37.

74. *FE*, పు. 319.

75, అముక్త, I, 36, 38 ; VII, 75.

76. రాయ, పు. 107, 109.

77. *FE*, 320.

78. కొడ్డిరాణి అనితల్లి కలువచేరు శాసనము (క్రీ.శ. 1423)న, 26 వ శ్లోకమున, కాకతీయుల నాటికి సంప్రదాయముగనున్న గజపతి, అశ్వపతి, నరపతి బిరుదములను గురించి ఇట్లు చెప్పబడియున్నది.

"గజపతి రుత్కళనాథః
పాశ్చాత్యాధీశ్వరోఽశ్వపత్రిః

తాభ్యాం నరపతి రధికః
ప్రతాప రుద్రోయత స్త్రీలింగేశః"

కావున తెలుగురాజులకు "నరపతి" బిరుదము కాకతీయులనాటికే ఏర్పడియుండినది. విజయనగర రాజులను నరపతులనుట కాకతీయులనుండి వచ్చిన సంప్రదాయమా అనునది విచారణీయము. పాశ్చాత్యధీశ్వరులన్న తురకలు. చూడు, భారతి, 1944 జూలై, పు. 63, మొదలు.

79. *NDI*, I, CP. 21, పు. 183-184. ఈ బిరుదము లేవన "పరమ వైష్ణవ, పరమ మాహేశ్వర, పరమ భట్టారక" "నవకోటి కర్ణాట కలుబర్గేశ్వర మహారాయ." వీరభద్రుడు శాసనములను, తన పేరనే, తన పరిపాలనావత్సరములను గనబరచి, వెలువరచినాడు. ఇది రాజప్రతినిధులకు, వారు రాజకుమారులైనప్పటికి, మిక్కిలి అరుదైన విశిష్టాధికారము.

80. *Sources*, పు. 102 మొదలు.

81. అదే, పు, 204 మొదలు; భారతి, 1929, జూన్, పు. 845 మొదలు.

82. రాయ, పు. 13, 47, 57.

83. పారి, II. 105; IV. 1.

84. మను I. 33,
85. ఆముక్త, I. 33.
86. ప్రస్తావన, శీర్షిక, 4 క్రింద చూచునది.
87. మను, 1.33.
88. ఆముక్త, 1.33.
89. *FE*, పు. 247_248.
90. అదే, పు. 363.
91. వచనము 17, పద్యములు. 81, 90, 91 చూచునది.
92. *MOML* No. 19_1_59. ; భారతి, 1929, అక్టోబరు, పు. 612-625.
93. *SII*. IX. ii, No. 507.
94. ఆముక్త, 1.38.
95 కృ రా వి, IV. 24_25.
96. రాయ, పు. 109.
97. *Sources*, పు. 145.
98. Taylor's, *Analysis*.
99. గజపతి కుమార్తెకు కృష్ణరాయలతో జరిగిన ఉద్వాహ వివరములకు చూడు, Subrahmanyam,R. *The Sūryavamsi Gajapatis of Orissa*, పు. 119_121.
100. అంకిత, VII. పు. 52.

అనుబంధము

మారీచీపరిణయమునందలి చారిత్రకాంశములు.

(సంగ్రహము)

చారిత్రకాంశములు

పద్య సంఖ్య

9. మోహనాంగి, "దెల్లుకైతకజుఁడేయగు నా యల సాని వంశంపు బెద్దన" తన గురువని తెలుపు చున్నది.

10. మోహనాంగి తన తండ్రి కృష్ణరాయలు రచించిన విష్ణుచిత్తీయము (ఆముక్తమాల్యద) నందలి కవి త్వము అలసానికవి 'అల్లికబిగి', ముక్కు-తిమ్మన 'ముద్దు పల్కు', పాండురంగకవి 'పదక్రమము' లతో నొప్పియున్నదని చెప్పుచున్నది.

12, 13, 14 రామరాజు మోహనాంగి భర్త. కృష్ణరాయల యల్లుడై, అభియ బిరుదమును అరుదుగా గొన్నట్టి వాడు. "ఆహవకేళి" "గవిసి ఖానుల తవతవ లాడ" జేసినవాడు.

16. కృష్ణరాయల విజయములను, ప్రాభవమును వర్ణించుచు, కుంతల మేదినీంద్రుడతని యాజ్ఞలను

పద్యసంఖ్య

ఔదలదాల్చి సలుపుచుండుననియు, కటక నృపాల కుడు అతని కాళ్లకు మోచేతులెత్తి ప్రొయ్యకు చుండుననియు, మధురాపురేశ్వరుడతని ప్రొయ్యాల తీయమాటల నాడుచుండుననియు, కాంచీపురజన నాయకుడు అతనిపనులు నడుముకట్టుకొని యొనర్చుచుండుననియు, చెప్పబడియున్నది.

17. వచనము:- కృష్ణరాయలు "మూరురాయర గండుండును" "తిరుమలదేవీ హృదయప్రియుండును," "చిన్నాంబా మనోహరుండును" "నరసింహదేవరాయ ప్రియనందనుండును," "నాగమాంబా తనూజుండును."

18,20 27. } మోహనాంగికి సమస్యా పూరణమునందుగల ఆసక్తిని సూచించును.

36. మోహనాంగి కృష్ణరాయలు దేవేరులలో నొకతెయగు తిరుమలాంబకు పుట్టినదనియు, ఆమెకు మొదటపెట్టినపేరు తిరుమలాంబయనియు, కాని భార్యపేరుగూడ తిరుమల యగుటచే, రాయలు కూతునట్లు పిలువ నిష్టపడక మోహనాంగియను కూర్మపేరుతో పిలువగడగినాడని తెల్పును.

పద్యసంఖ్య

37. రాయలకును, మోహనాంగికిని గల చతురంగ క్రీడాసక్తియు, రాయలకు ఆశువుగ కవిత్వము చెప్పగల శక్తియు, † మోహనాంగికి సమస్యా పూరణముసందుగల రక్తియు, మోహనాంగికి చిత్రకళయందును, సంగీతమునందునుగల నైపుణ్యమునందు కృష్ణరాయడు కనపరచు ఆసక్తియు, అళియరామరాజు కృష్ణరాయని ఇంట ఇల్లెట ముండుటయు తెల్పును.

38. కృష్ణరాయలకు రామాయణమునందుగల ప్రీతిని దెల్పును. తన తండ్రికి రామాయణము ఇష్ట మగుటజే తన కావ్యమునకు కథావస్తువుగా, కల్పి తము నొకింతచేర్చి, రామాయణ సంబంధ గాథను ఎన్నుకొంటినని మోహనాంగి తెలుపు చున్నది.

40-64. రాయల వంశవర్ణన - పౌరాణికము.

40. చంద్రుడు - తారాప్రియుడు.

|

41. బుధుడు - ఇళ.

|

† "కవితా ప్రౌఢిమ్ణ ఫణీశా"-పారి, IV. 1.

పద్యసంఖ్య

42. పురూరవుడు.

|

ఆయువు.

|

నహుషుడు.

|

43. యయాతి,

|

తుర్వసుడు.

44. తుర్వసుసంతతిలోపల ఊర్వశు లనేకులుద
యించిరి.

45. వారిలో ప్రసిద్ధికెక్కినది తుళువ వంశము -
అని చెప్పి, మోహనాంగి, **తుళువ** శబ్దము నిజ
ముగా **తుర్వసు** శబ్ద సంభవమా? లేక ఆ వంశ
మువారు శత్రువుల గెలిచి వారి సతులకు
"**తులువ**"లయిరా అని తన సంశయమును చమ
త్కరించినది.

రాయలవంశవర్ణన - చారిత్రకము

46. మంగ మహీపతి

|

("విపక్ష పక్షీతతి
సాళువమై మెల
గుట సాళువవారె
వెలసి రతనిసంతతి"

పద్యసంఖ్య



47. సాళువమంగునకుగల "పరపక్షి సాళువ," "సాంప రాయ స్థాపనాచార్య" బిరుదములను దెలుపును.

పద్యసంఖ్య

50. సాళువ నరసింహరాయలు జైమినిభారతమును కృతినందుకొన్న విషయమును, "ఫల్గునిని బోల్కిని దానొనరించినట్టి సంగ్రామములం జరిత్ర ముగ గ్రాసిన నొండొక భారతంబు కాఁగా" ఏర్పడిన గ్రంథమును (సాళువాభ్యుదయమా?) పేర్కొనును.

54. ఈశ్వరరాజు ఉదయాద్రి ప్రభృతి ప్రదేశముల నిర్జించినాడని చెప్పును

60. నరసానాయకుడు కుంతలమాది పదంబులెల్ల గెల్చుట దెల్పును.

62 నరసానాయకుడు నంది మల్లయ, మలయ మారుత (ఘంటసింగయ) కవులు రచించిన వరాహపురాణమును కృతినందినాడని తెల్పును

66 కృష్ణరాయజన్మ దినము - శా. శ. 1393, విక్రతి సంవత్సర పుష్యబహుళ ద్వాదశి శుక్రవారము. (17-1-1471).

67 అన్నగారి తర్వాత కృష్ణరాయలు రాజ్యమునకు వచ్చినట్లు దెల్పును.

పద్యసంఖ్య

68. కృష్ణదేవరాయలు అపర కృష్ణావతారమే† యని చమత్కారముగ వర్ణించును.

74. కృష్ణరాయల తన దక్షిణ దిగ్విజయయాత్రలో గంగవంశపు రాజులను, మహేశూర, శివసముద్ర, శ్రీరంగములను గెలిచినాడని తెలుపును.

75. ఉదయగిరియందు ప్రహరేశ్వర పాత్రుని లోగొని అతని నవరత్న కిరీటము తన కాలిపీటగా కృష్ణ రాయలు స్నానమొనర్చి, జయలక్ష్మిని వరించి నాడని దెల్పును.

76. కృష్ణరాయడు అనిమొన నిలచి పిలువగా, వీర భద్రుడు ప్రాణములకు వెరచి, సకుటుంబముగా, కనకగిరి వదలి వింధ్యమునకు పారిపోయినాడని తెల్పును.

77. రణమున ఓడిన వీరభద్రుడు మణులను, నిజాత్మజా మణిని కృష్ణరాయని కొసగగా, వింధ్యభూముల భిల్లదొరలు అతని తొల్లిటి జాంబవంతునిగా దలచిరట.

78. కృష్ణరాయలు తన పూర్వ దిగ్విజయయాత్రలో,

† "సాక్షాత్ ప్రత్యక్ష కృష్ణావతారం"-SII, IX. i.507.

పద్యసంఖ్య

కొండవీడు, విజయవాడ, రాజమహేంద్రవరము లను, ఒడ్డెమూకలను జయించెనని తెలుపును.

79. ఏనుగలతోకూడిన కృష్ణరాయల సైన్యములు ప్రాగుటజేసి కృష్ణా, గోదావరులలోని నీరు ఇంకిపోగా, వానిని రాయలు తన దానధారలచేత మరల నించినాడు.

80. కృష్ణరాయల కీర్తిని లోకులకు వ్యాఖ్యానము గావించి చెప్పుటకు పాతాళమునుండి వచ్చిన ఆదిశేషువో యనునట్లు పొట్టునూరికడ విజయస్తంభము గొప్పగా సంజాతమయినది.

81. ప్రతాపరుద్రుడు కృష్ణరాయనిచే భంగపడి, దీనుడై, తన కూతురైన లక్ష్మిని కృష్ణరాయని కిచ్చి సంతోషపెట్టెను.

83 కృష్ణరాయలు, తన్నెదిర్చిన బీజపూరు సుల్తాను ఏడిలఖానును "రంభమేడ"కు పంపగా వేల్పుబొజ్జంగులు వెచ్చనూర్చిరట.

84 కృష్ణరాయల కత్తికెరయై గోలకొండ, బీజపుర ములనుండి దొడ్డఖానుబిడ్డలు స్వర్గమునుచేరగా,

పద్యసంఖ్య

అచటవారికి ఉంపుడుకత్తెలైన ఊర్వశ్యాద్యప్స
రసలు బిబ్బీల వేషధారణ మొనర్చిరట.

87. కృష్ణరాయలగురించి కవులు కోట్లుగా విరచించి
నట్టి చాటువులే ఒక ప్రశస్తతరగ్రంథము
గాగలవు. కర్ణాటకవీశులు, ఆంధ్రకవినాథులు
రాయలసభలో మేమేగొప్ప మేమేగొప్పయని
పోటీపడెడివారు.

88 పెద్దన, తిమ్మన, ధూర్జటి, మల్లన మొదలైన
అష్టదిగ్గజ కవులను, మంత్రిసత్తముడైన తిమ్మ
రుసును గూడి, "భువనవిజయ" నామక సభాభవన
మందు కృష్ణరాయడు కొలువుదీరును.

89 స్వయముగా కవి. చుట్టూ ఉన్నవారందరూ
కవులు. కృష్ణరాయల రాజధాని విద్యానగర
మనుటలో విచిత్రమేమి గలదు?

90. తెలుగునృపాలుడై నరపతిత్వము గలిగిన వీర
భద్రుని పుత్రికను, ఓఢ్రుడై గజపతిత్వము గలి
గిన ప్రతాపరుద్రుని పుత్రికను వరించి, అశ్వపతి
యగు తురకరాజు పుత్రికను గైకొనక, కృష్ణ
రాయలు పంక్తిపక్షపాతమును చూపెను,

పద్యసంఖ్య

91. విష్ణుదేవునికి భూ, శ్రీ దేవులవలె, అన్నపూర్ణా దేవియును, తిరుమల దేవియును, కృష్ణరాయలకు పట్టపుదేవులై వాసిగాంచిరి.

92. తిరుమలాంబకు మోహనాంగియు, అన్నపూర్ణకు వెంగళాంబయు జన్మించిరి.

93. ఆముక్తమాల్యదను అంకితమందిన శ్రీ వెంకటేశ్వరుడు, ఆ ప్రబంధమునందలి కథానాయకుడు శ్రీరంగనాయకుడు, కలలో ప్రత్యక్షమయి ఆ కృతిని రచింపుమన్న శ్రీకాకుళాంధ్ర విష్ణువు, ఆ ప్రబంధము ప్రాయకమున్న తాగొల్చినట్టి సింహాచలస్వామి-వీరందరు అన్నివిధముల రక్షింపగా "రాజపరమేశ్వర రాజరాజాధిరాజ వీరప్రతాప మూరురాయరగండ" బిరుదాంకితుడైన కృష్ణరాయలు అలరుచున్నాడు.

చతుర్థాశ్వాసము

1. కృష్ణరాయడు "శ్రీ సుమశర సమరూప విలాస విభాసుర సుపుత్ర లాభప్రాప్త" అని సంబోధింపబడి, అతనికి గలిగిన పుత్రలాభప్రాప్తిని తెలుపుచున్నది.

పద్యసంఖ్య

2. } తిరుమలాంబ సదాశివుని కృపవలన
3. } సదాశివుడను పుత్రుని కనెను. చిరకాల మనో
4. } భీష్ట సిద్ధిచే కృష్ణరాయలు సంతుష్టాంతరంగుడై
యుండెను.

BIBLIOGRAPHY

ఉపయుక్త గ్రంథములు

INSCRIPTIONS :

Annual Reports on South Indian Epigraphy (from 1887)

Annal Reports on Epigraphy (from 1946)

Epigraphia Carnatica (from 1898)

Epigraphia Indica (from 1892)

Historical Inscrptions of Southern India, by R. Sewell, Ed. by S. Krishnaswami Aiyangar, Madras, 1932.

Lists of Antiquities, Vols. I & II, by R. Sewell, Madras, 1882 & 1884.

Nellore District Inscriptions, 3 vols., by Alan Butterworth and V. Venugopala Chetty, Madras, 1905.

South Indian Inscriptions.

Tirumalai Tirupati Devasthanam Inscriptions, 4 vols., Madras, 1931–'36.

LITERARY AND TRADITIONAL

TELUGU WORKS :

Kṛṣṇadēvarāya : *Āmukta-mālyada*

Kumāra Dhūrjaṭi : *Kṛṣṇarāyavijayamu*

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
ACC. No:

Mallaya Nandi & Siṅgaya Ghaṇṭa : *Varāhapurāṇamu.*

Nṛsimhakavi Sankusāla : *Kavikarṇarasāyanamu.*

Peddana Allasāni : *Manucaritra.*

Pinavīrabhadra Pillalamarri : *Jaiminibhāratamu.*

Rāmarājabhūṣaṇa : *Vasucaritra.*

Sthānāpati of Visvanāthanāyaka : *Rāyavācakamu.*

Timmana Nandi : *Pārijātāpaharaṇamu.*

Sources of Vijayanagara History, Ed. by S. Krishnaswamy Aiyangar, Madras, 1919.

Vijayanagara Sāmrājyavu, a *Kadita,* M. O. M. L. No. 19-1-59.

Further Sources of Vijayanagara History, 3 vols., Ed. by K. A. Nilakanta Sastry and N. Venkataramanayya, Madras, 1946.

Local Records.

MODERN WORKS :

ENGLISH :

Hayavadana Rao C. : *Mysore Gazetteer,* Vol. II, Part III, Bangalore, 1930.

Heras : *The Aravidu Dynasty of Vijayanagar,* Madras, 1927.

Majumdar R. C. (Ed.): *History and Culture of the Indian People*, Vol. VI, Bombay, 1960.

Mukherjee, P.: *The Gajapati Kings of Orissa*, Calcutta, 1953.

Pillai Swamikannu: *Indian Ephemeris*.

Sewell, R.: *A Forgotten Empire*, Madras, 1924; Reprints, Delhi, 1962, 1970.

Sherwani, H.K.: *Muhammad-Qulī Qutb Shāh*, Bombay, 1967.

Taylor: *A Catalogue Raisonne of Oriental Manuscripts*, in the Governtment Library, 3 vols, Madras, 1857-1862.

Ramachandraiah, O.: *Studies on Kṛṣṇadēvarāya of Vijayanagara*, Waltair, 1953.

Subrahmanyam, R.: *The Sūryavaṁsi Gajapatis of Orissa*, Waltair, 1957.

Venkata Ramaswami Pandit, Cavelly: *Biographical Sketches of the Dekkan Poets*, Bombay, 1829, 1847.

TELUGU:

Arudra: *Samagra Āndhra Sāhityam*, Vols. VII & XI, Madras, 1965 & 1967.

Lakshmana Rao, K.V. : *Mahammadīya Mahāyugamu*, Madras, First Ed. 1908; Second Ed. 1911.

: *Vyāsāvali*, 1923,

Lakshmikantamma, Utukuru : *Āndhrakavayitrulu*, 1953.

Prabhakaramatya Veldanda : *Āmuktamālyadā Paryālōkanamu*, Hyderabad, 1945, Reprint, 1958.

Narayanacharyulu Puttaparti : *Vyāsasaurabhamu*, Cuddapah, 1964.

Ramakrishnakavi, Mocherla : Introduction to *Kavikarṇarasāyanamu*, A. P. Sahitya Akademy, Hyderabad, 1967.

Somasekhara Sarma, M. and others (Eds.) : *Vijñānasarvasvamu*, Vol. III, Madras, 1959.

Seshaiah; Chaganti : *Āndhra Kavi Taraṅgiṇi*; Vol. VII, Kapilesvarapuram, 1950.

Venkataraya Sastri, V. : Commentary entitled *Sanjīvani* on *Āmuktamālyada*,

Venkataramanayya, N. : *Vāṅgmayavyāsamanjari*, Hyderabad, 1967.

Viresalingam, K. : *Āndhra Kavula Caritra*, Rajahmundry, 1896.

MUSLIM HISTORIES :

Briggs, J. (Tr.) : Translation of Firishta's *Tārīkh-i-Firishta* under the title *History of the Rise of the Mahomedan Power in India*, 4 Vols., London, 1829, Reprints, Calcutta, 1908; 1966–'71.

JOURNALS :

TELUGU :

Āndhra Sāhitya Pariṣat Patrika, Kakinada.

Bhārati, Madras, from 1924.

Samadarsini Annual, Madras, from 1927.

Bulletin of the Government Manuscript Library, Madras.

" *Pramāṇa-siddhānta-viruddham = atra*
yat = kiñcid = uktaṁ mati-māndya-dōṣāt
mātsaryam = utsārya tad = ārya-cittāḥ
prasādam = ādhāya viṣōdhayantu "

" ప్రమాణసిద్ధాంతవిరుద్ధమత్ర
యత్కించిదుక్తం మతిమాంద్యదోషాత్
మాత్సర్యముత్సార్య తదార్యచిత్తాః
ప్రసాదమాధాయ విశోధయన్తు "

MĀRĪCĪPARIṆĀYAMŪ

(Extant Text)

మారీచీపరిణాయము

(ఉపలబ్ధగ్రంథము)

MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.

LIBRARY

వకారీచీపరిణాయము

-: అవతారిక :-

శ్రీ మజ్జానకి లజ్జతో మెడను బుస్తెం దాను గట్టించు కొం
చామై మంగళసూత్ర మూర్మిళ గళంబం దర్మిలి గట్టు శ్రీ
సౌమిత్రిం గన నట్టునెత్తఁగ, దదాస్యం బాస్యమున్ వంచుచుం
బ్రేమం జూచెడి రాముఁడోముతఁ గృపన్ శ్రీకృష్ణరాయప్రభున్, 1

చ॥ "వనముల బ్రహ్మచర్యమున వర్తిలుచుండుటఁజూచి కోరి వ
చ్చిన దనుజాంగనన్ మబదిచేకొనఁ; డీతని కొక్క యన్య క
న్యను జతగూర్పఁగావలయు," నం చెలనవ్వువఁ బల్కుసీత తా
మనుచుత సజ్జనాగ్రణిని మజ్జనకుండగు కృష్ణరాయనిన్. 2

మ॥ పలుమాఱున్ జననీ పయశ్చయము చేఁపంజేఁపఁగా బ్రాగుచున్
నెలఁబాలుండు చెలంగ, వానిని జటానీకంపు టుయ్యాల లో
పల జోకొట్టుచు నూఁపునట్టి విధమొప్పన్ నృత్యముఁ సల్పుక్రొ
న్నెలదాల్పిచ్చుతఁ గృష్ణరాయనికి నిర్నిద్రంపు ఐశ్వర్యముల్. 3

చ॥ పితయును మాత తానెయనఁ బేర్వడి, దిక్కును మ్రొక్కలేని దు
ర్గతిగల దీనమానవులఁ గాచెడునట్టి తలంపునన్ జగ
త్త్రితయమునందు సత్పథగతిం బరమేశ్వరుతోఁ జరించు పా
ర్వతి నరసింహకృష్ణవిభు వాసవసన్నిభుఁ జేసి ప్రోచుతన్, 4

మ॥ "కనకంపున్నెఱచేల కట్టుకొని బంగారంపు రంగూనె బొ
జ్జను యమ్మజ్జనకుండు; మీ జనని సాక్షాత్సౌవర్ణపున్ ముద్ద శ్రీ
కనకాంగీమణి; కాన మీ కడుపు బంగారయ్యె," నంచున్ నిజాం
గన నవ్యక్ నగు బ్రహ్మ మజ్జనకునింగావించు దీర్ఘాయుఁగన్. 5

ఉ॥ గాయకు కంఠమండుఁ గవిగంటమునందును దొల్త సంభవం
బై, యమృత ప్రవాహముగ నచ్చట వెల్వడుచున్ రసజ్ఞ హృ
త్తోయధి సంగమంబున నతుల్ గ్రహియించెడి యా సరస్వతిన్
దోయిలిగొన్న కేలుగవతోడను దోడుగ నుండవేఁడెదన్. 5_a

మ॥ సురగంగార్ద్రిత మిన్నుముట్టునటు హెచ్చుంగాంచు గౌరీశు బం
ధుర కేశాటవి లోపలన్ వెలఁగపండుంబోలె వెల్గొందు చం
దురులోఁగల్గు సుధారసంపు గుజురుం దుండంబుతో గ్రోలి, మా
ధురికిం బెంకును జాలమెక్కు గజవక్త్రిండీచ్చు నిర్విఘ్నుతన్. 6

ఉ॥ వాకొనునట్టి దెల్ల రసవత్కవితాకృతిగాఁ దనర్చు వా
ల్మీకిని, బల్కినట్టి నుడిలేశముఁగేవల వేదరూపముం
జే కొనునట్టి వ్యాసుని, రచించిన దంతయు శారదాకృతిం
గైకొను కాళిదాసు, నధికంబగు భక్తిని సంస్మరించెదన్. 7

మ॥ తెనుఁగున బాస ప్రపంచమంతటికి నాదింబొల్చి, విద్వోషు లౌ
ట నిజాంచత్పదముల్ బుధాగ్రణులు వేడ్కన్ మౌళులం దాల్చి మ
న్నన సల్పంగఁ, ద్రిమూర్తులై వెలయు నా నన్నయ తిక్కన్న యె
ఱ్ఱనలన్ భావమునన్ స్మరించెదను నే నాంధ్రాభిలాషంబునన్. 8

ఉ॥ "పెద్దన విద్దెలందుఁగడు బేర్వడనీయన, వేల్పు బొజ్జ పెం
పె?"ద్దనఁ, దక్కినట్టి కవియెట్టిఁడు నీతనితోడఁ బోల్ప గొ
ప్పెద్దనఁ, దెల్గు క్రైతకజుఁడేయగు నా యలసాని వంశపుం
బెద్దన, మద్గురూత్తమని బెద్దయు గౌరవబుద్ధిఁ గొల్చెదన్. 9

చ॥ అకలుష మాధురీ కవితయై యలసాని కవీంబోలె న
ల్లిక బిగి, ముక్క తిమ్మకవి లీలను మద్దగు పల్కుఁ, బాండురం
గకవి గతిం బదక్రమముగల్గు కవిత్వముతోడ విష్టుచి
త్తు కథరచించు మజ్జనకుఁ దోరపుబత్తి నుతించి మ్రొక్కెదన్. 10

చ॥ కయితను దోషముల్ వెదకుకార్యము కాకవి చేయునట్టిదే
యయినను, దానిచే సుకవులందఱు శ్రద్ధమెయిం బ్రబంధ సం
చయము లొనర్తురంచును విచారణచేయుచు బాచిగానికిఁ
భయమును భక్తియుం గలిగి పల్మఱు మ్రొక్కి బహూకరించెదన్. 11

సీ॥ జిగిబిగి ప్రాయంపు వగలాండ్రు పొగడు సో
యగమందుఁ దొగపేని యల్లుఁడగుచు,
జోగులన్ భోగులఁగాఁగఁ జేయఁగల ద
యా గుణంబున వారి యలుఁడగుచు,
విశ్వవిశ్వంభరాధీశ్వరులుఁ మెచ్చు
నైశ్వర్యమునఁ గొండ యల్లుఁడగుచుఁ,
గవిసి భానుల భవభవలాడఁ జేయు నా
హవకేళి వసుదేవు నల్లుఁడగుచు,

గృష్ణరాయ వసుంధరాధీశు నల్లఁ
డౌట నల్లురయందల్లుఁడగుచు, నళియ
బిరుదు నరుదుగాఁగొన్నట్టి బిరుదుమగని,
మగని మదిలోన విల్పి నమస్కరింతు. 12

చ॥ వనుఁదరియించునట్లుగ నొనర్చెడి తారకమంత్రమయ్యు, నే
ఘనుని సమాఖ్య నోటఁబలుకంగను జెల్లుగాన నేను నె
మ్మనమున సంస్మరింతు, నల మద్విభు పద్మనజద్వయంబు నేఁ
గనులకు నద్దుకొందు నధికంబగు భక్తియు రక్తియుం దగన్. 13

తే॥గీ॥ "రాఘవా, మహీపుత్రికారమణ, రావ
ణారి, జుహూరాణ తనయావనా," యనఁ బ్రథ
మాక్షరావళి యే ఘనునాఖ్య యౌనొ
యట్టి మత్పతి దైవంబె యగును నాకు. 14

వ॥ ఇట్లిష్టదేవతా ప్రార్థనంబును, బురాత నాధునాతన సంస్కృ
తాంధ్ర కవీంద్ర సంస్మరణంబును గురుజన వమస్కరణంబును గావించి,
యెద్దియేని ప్రబంధంబు నవరస బంధురంబుగా రచింప నుద్దేశించుయున్న
సమయంబున. 15

సీ॥ తనయాజ్ఞ లెల్లఁ గుంతలమేదినీంద్రుఁ డౌ
దలమీఁదఁ దాల్చి సలుపుచుండఁ,
దన కాళ్ళకుం గటకనృపాలకుఁడు ముంగ
మురపుం గరములెత్తి మ్రొక్కు చుండఁ,

దన మ్రోల మధురాపుర నరేశ్వరుఁడు దయ
కయి తీయమాటల నాడుచుండఁ,
దనకుఁ గాంచీపురీ జననాయకుఁడు పనుల్
నడుము కట్టుకొని యొనర్చ చుండఁ,

దనదు ఘాటికి భామినీ ధరణిపతులు
భీరుజనములై గడగడ వెగ్గడిలఁగ
నతుల కర్ణాట రాజ్యసింహాసమున
నోలగంబున్న కృష్ణరాయోర్వీధవుడు. 16

ప॥ వెండియుఁ బుండరీక గర్భాండ భాండ పిచండిల పాండురాఖండ యశస్సుధాస్వాదన పరిలబ్ధ నవ్యదివ్యత్వ మండిత ప్రచండరిపు ప్రకాండుండును, మూరు రాయర గండుండును, నిజభుజారంగ రంగత్కృపాణాంగనా హృదయంగమన్నృత్తరంగ స్థలాయమాన సంగరరంగ రంగవల్లీభంగీ సంపాది రిపుసంఘ మాతంగ కుంభగళిత మౌక్తికచయుండును, దిరుమలదేవీ హృదయ ప్రియుండును, మధ్యందినాంభోజబాంధవ శుంభత్తేజో విజృంభ న్నిజావక్రపరాక్రమ కుంభసంభవ చుళుకిత గంభీరాంబోధి విధావిభాసిత శాత్రవసైన్య మోహరుండును, జిన్నాంబా మనోహరుండును, స్వకీయామందదాన వినిందిత ఘనా ఘన బృందార విందారి బృందారక ధేను సింధు సందోహ హరినందన హరిచందనుండును, నరసింహదేవరాయ ప్రియనందనుండును, గవిజన రాజరాజ పూజన భాజన కవితా విరాజమాన ముఖాంభోజ విభ్రాజిత నవీన భోజుండును, నాగమాంబా తనూజుండును, నమజ్జన హృజ్జలజాత వికసన జనకుండును, మజ్జనకుండును, దుష్కర ముష్కర తురుష్కవక్త్ర పుష్కర శ్మశ్రు

శైవాల పుష్కల పరచమూ పుష్కరిణీ పరివర్త గంధసింధురుండును, గర్ణాటరాజ్య రమాధురంధరుండునగు శ్రీకృష్ణదేవరాయ వసుంధరా వర పురందరుండు కొలువు విడిచి, యిందిరా సుందరీ మందిరంబగుట నర విండంబు చందంబున నందంబుగందనర్చి తన సౌధంబునందలి తేకుల యాకృతి గైకొను వాకిళులఁ గడచివచ్చి, యంతిపురంబుఁజొచ్చి, యచ్చోట హెచ్చగు మెచ్చులందెచ్చి నొక గదియం దచ్చపుం జిత్తరువుం బోలె మెత్తని దిండున కొత్తుకొని చిత్తంబున మొత్తంబులై పుట్టు క్రొత్త యూహల కతంబునఁ దన్నుంజూడని నన్నుంజేరి, యంబోధర గంభీర వాగ్గుంభనంబుల నిట్లనియె. 17

తే॥గీ॥ "కన్ను బొమలు పైకెగసి యిటున్న వేల?
చేతి యండిటు చెక్కిలి చేరనేల?
చూపులిటు వట్టి బయలును జూచునేల?
పట్టి, యెట్టి గట్టి సమస్య పట్టుకొంటి?" 18

క॥ అన నులికి పడుచుఁ గడుఁజ
య్యన లేచిఁ, తదీయ మృదుపదాబ్జ ద్వయికిఁ
వినతి యొనరించి, నేదా
పున నిలిచి, మదింగల చనవున నిట్లంటిన్. 19

ఉ॥ "తండ్రి, సమస్యపూర్తికి నెదం దలపోయుటలేదు; మీరలే
మంద్రొ మదీయ సాహసము నారసి, కావ్య మొనర్పఁబూనితిన్;
'వీంద్రకుఁ బాకముండఁగఁ, గవిత్వపుఁ బాకమునేల?' యంచుని
ల్లాఁద్రను గేలిసేయు జనులందఱు మెచ్చెదునట్టి శైలితో". 20

చ॥ అనవిని, ''యెట్టెట్టూ? పలుకవమ్మ మటొక్క తటీం; బ్రబంధ మీ
వొనరుప వింతకాలమున కూహ యొనర్చితె? యెంతచెప్పినఁ
వినకయె యుంటివిందనుక; వీనులవిందుగ నీదుకబ్బ మో
తనయ, వినంగ నబ్బునొ కదా యని నిత్యమపేక్ష చేయుదుఁ, 21

క॥ చదువుల సరస్వతివి, నీ
మృదుకవితాశైలి స్త్రీలకే యననేలా?
తుదకుం గొమ్ములు తిరిగిన
మదవత్కవి పుంగవులకు మహిని గలుగునే? 22

శా॥ స్త్రీలన్నంతనె చుల్క చేయుటకు కుమారీ, మౌఢ్యమేసుమ్ము, నా
రీలోకంబున శేముషీయుతలు లేరే పూర్వ? మింతేటికిఁ,
నాళీకాసానురాణి స్త్రీయెకద? యెన్నం, గోమలాంగీ వచో
లాలిత్యంబది మోటుపూరుషుల కేలా యబ్బఁగా నేరుచుఁ? 23

ఉ॥ కమ్మనితేనె లొట్టిపడఁగా విపుడీవొనరించు గ్రంథమో
యమ్మరొ, యిష్టదైవమున కంకితమున్ సలుపంగ నీదుడెం
దమ్మున నీవు నిశ్చయమొనర్చిన లెస్సయె; లేకయున్న, నా
కిమ్ము త్వదీయకావ్యసుత; నేనెదఁజేరిచి యాదరించెదన్. 24

చ॥ అవునవు, ధాత్రిలో మనుమరాలిని బెండిలియాడవచ్చు; నీ
నవనవకావ్యకన్య యిది నా యెడ, వృద్ధవరుండనౌట, మ
క్కువ పడదంచు మానుకొనఁగూడదు తక్కువయీడుభార్య కె
క్కువ యగు మక్కువన్ సుఖముఁగూరుచు నెక్కువయీడు భర్తయే. 25

ఉ॥ పుత్రిక తొల్తఁబుట్టు టతిపుణ్యకరంబని నేనెఱింగియుం
బుత్రుఁడు నాకొకండయినఁ బుట్టమి, రాజ్యమునెల్ల నేల దొ
హిత్రుఁడె నాకుఁ దొల్త జనియింపఁగ గోరెదఁ, గానఁ గబ్బపుం
బుత్రిక నీవుకాంచునెడఁ, బుణ్యమునుం బురుషార్థముం జుమీ. 26

క॥ నగలిచ్చెద, నాజెము లె
చ్చుగనిచ్చెదఁ, గోరినట్టి సొమ్మిచ్చెద నీ
సొగసుం గృతికన్యక," కని
నగుచున్ నా మొగము చూచి నాయన పలుకన్. 27

ఉ॥ అల్లన నిట్టులంటి, "దయ నల్లునియల్లుఁడ వైతివే కదా"
యల్లది చాల, కీ సరణి నల్లునియల్లుఁడ వౌట కెంచితే
తల్లికిఁ గ్రొత్తగా సవతి దాపుర మైనను, దండ్రి పెండ్లి యం
చెల్లరు సంబరం పడుదురే కదఁ కావున నట్లె చేసెదన్. 28

క॥ "ముదిరిన కొలందిని రసము
గదిరెడు చెఱకట్టులు రసికత ముదిరిన నిన్
ముదుకుఁడ వనవచ్చునెఁ యె
ట్లొదవును గన్యకలకిట్టి యొడయఁడఁ," డటన్నన్. 29

ఉ॥ నవ్వుచుఁ దండ్రి నాదు వదనంబునఁ జూడ్కిని నిల్పిపల్కెఁ, "నీ
వెవ్విదినేని సమ్మతిలుఁబేకద కావలె? నీదుకన్య లే
జవ్వనమందునున్నఁ, దనుజాతరొ, తాతకునాతియైనచో
నవ్వయెయౌ; నటుల్ పడుచుటవ్వ నొనర్చుకృతిఁ బిగిన్మతిన్. 30

క॥ తియ్యని నుడువులును నడక
యొయ్యారము కలిగి భూషణోజ్వలయై, నా
కెయ్యెడ రక్తిగొలిపి, మృదు
శయ్యను నీ కృతిసుత పద సమ్మతి సుమ్మీ. 31

ఉ॥ "జాలము వల్ద,"ంచు సరసంబుగఁ బల్కిన తండ్రిఁజూచి నే.
"నాలను జూలు లేదు, మఱి యర్భకునామము సోమలింగమ
ీలగ నున్న,"దంచుఁ గడులేనగవొప్పఁగ నన్నఁ, "జాలునో
బాలిక, తప్పుకొంట కిటుపల్కెదఁ యొప్పను జుమ్మి తప్పినన్. 32

వ॥ ఇదె నిశ్చయతాంబూల," మని నికటస్థిత కనకకలాచికనుండి కర్పూ
రవీటికం దీసి నా చేతనునిచి మాఱాడకుండ నాన లిడియె. 33

చ॥ పసితనమందు నేను దనప్రక్కను జిందులు త్రొక్కుచుండఁ, గ్రొం
బసిఁడి పసందుటందియలఁ బల్కిడి మువ్వలమ్రోఁత వింటకున్
విసువఁడు; నాదు పద్దెములు విద్దెలముద్దియ పైఁడియండెలం
దెసఁగెడు మోఁతలంచు వినునిప్పుడు మజ్జనకుండు ప్రేమచే. 34

క॥ "అమ్మా, నీగర్భమునఁ
గ్రమ్మఱ జనియింతు సుమ్మ; కడుఁబ్రేముడి నా
కమ్మెయిఁ బెట్టుమ యీ నా
మమ్మే" యను నాదుతండ్రి మక్కువయెంతో. 35

ఉ॥ తిర్మలదేవికే పొడమితింగనుకన్ మును తిర్మలాంబ యం
చర్మిలిపేరు నాకిడియు నట్లుగఁ దా బిలువంగ రామి, నన్
గూర్మిని మోహనాంగియను క్రొత్త సమాఖ్యను బిల్చి తండ్రికిన్
జర్మముకోసియిచ్చినను జాలదుగాదె ఋణంబు తీర్పఁగన్. 36

సీ॥ చతురంగబలయుత సైన్యముల్ నడిపెడు
నతఁడు నాతోఁజతురంగమూదు;
గంగార్భటివి నాఱుకవిత చెప్పునతండు
నాసమస్యాపూర్తి కాసచెందు;
దిక్కుఁద్యములను సత్కీర్తిఁ జిత్రించు నా
తండు నారాయు చిత్రముల మెచ్చు;
రాగసంభరితాంతరంగుఁడౌ నతఁడు నే
రాగమాలాపింప రక్తిగాంచు.

నన్ను, మన్నాథు నింట మన్ననలతోడఁ
గన్నులం గప్పుకొని ప్రోచెఁగాదె యట్టి
పిత మహాకావ్యకర్త నఁ గృతిని గోరె
నాదు భాగ్యంబు వర్ణింపఁగా దరంబె 37

ఉ॥ నాయన కిష్టమౌకథయె నాదు ప్రబంధముగా నొనర్తు; రా
మాయణమన్న నాయనకు మక్కువ మిక్కిలి యెక్కుడౌట నే
నాయది కొంచుఁ గల్పితము నందు నొకించుక చేర్చి కూర్చెదం
దోయజ సన్మరందరస తుందిల సుందర కందళోక్తులన్, 38

వ॥ అని నిశ్చయంబుసల్పి, యనల్పవైచిత్రితో నొక నవీనకథ కల్పించి. దానిని మారీచీపరిణయంబును ప్రబంధంబుగా రచింపనెంచి, తత్కృతి ముఖంబున కలంకృతిగా మత్పితృ వంశాభివర్ణనం బాచరించెద. 39

సీ॥ అమలంపుఁ గమలంపు రమలింపుననను నింపు
చెలులమోములను మందలముచేతఁ
దొగచాలు నగఁజాలు జిగిదాలుచుఁ గ్రాలు
మగువలకను లంకమృగము చేతఁ
బలుకుందముల యందములఁ బొందఁగల సుంద
రుల నగవులను వెన్నెలల చేత
ననుతేనెలను బూనెననఁగా నెసఁగు లేనె
లఁతల పల్కులఁ నిజామృతము చేతఁ

బోలాటంజేసి తన కాఁడుపోడిమిఁ గల
దందురంచుఁ దారా సుందరాంగిని వల
పించి దిగధీశులకు మది భీతిని మొల
పించి మఁగటిమిఁ దారకాప్రియుఁడు నెగడు. 40

కll విధునకుదయించెఁ దారా
వధూతిలకమందు బుధుఁడు ప్రథితబుధుఁ డీతా
మధురోష్ణి హృదుపవనీ
మధుఁడు లతాంగీ నవీనమన్మథుఁడు ధరన్. 41

క॥ ఆయనకుఁ దనూజాతుం
డై యుదయించెను బురూరవాఖ్యనరేంద్రుం;
డాయువు తనయుండాయన
కాయెఁ; నహుషుఁ డతనికి సుతుఁడై యుదయించెన్. 42

ఆ॥వె॥ అతనికుద్భవిలె యయాతి నయాతి ద
యాతి సద్గుణముల ఖ్యాతిఁగల్గి;
నుర్వి నతఁడు కనియెఁ దుర్వసు, శర్వసు
పర్వసురభి సదృశ బహుశయశుని. 43

క॥ తుర్వసుసంతతిలోపల
నుర్వీశులనేకులుదయమొందిరి; వారల్
గర్విత రిపుధైర్య మహా
పర్వత భిదురుల్, నృపనయపారగవిదురుల్. 14

తే॥గీ॥ తుఱువవంశ మవ్వారియందుం బ్రసిద్ధి
పడసెఁ; దుర్వసుశబ్దసంభవము తుఱువ
శబ్దమో? లేక తద్వంశజాతు లరిత
తులగెలిచి వారిసతులకుఁ దులువలైరో? 45

క॥ తుఱువాన్వయ మంగమహీ
తల విభుఁడు విపక్షపక్షితతి సాఱువమై
మెలఁగుట సాఱువవారై
వెలసి రతని సంతతిఁ బ్రభవించిన వారల్. 46

సీ॥ పరపక్షిసాళువ బిరుదంబు సాంపరా
యస్థాపనాచార్యఁ డనెడి బిరుదు
బిరుదుమగలు మెచ్చ నరుదుగాఁ గైకొని,
నరుదురంబునఁ గాంచి కురుదళములు
సరుదు కొనఁగ నేర కరదముల్ హయములు
ద్విరదముల్ భటులును దురదురమని
చెదరు రీతి నరాతిసేనలు తనుఁజేర
రాని యవక్ర విక్రమముతో మె

లంగు సాళువమంగు ముంగొంగు పసిఁడి
యొచ్చు దోఁచుచుఁ బ్రోచెను యాచకతతి;
నాతనికిఁ దనూజాతుండు గౌతరాజు;
కొమరుఁడైపుట్టె నతనికి గుండరాజు. 47

క॥ గుండజనపతికిఁ దిమ్మవి
భుండును నరసింహరాజుఁ బుత్రకులై మా
ర్తాండ హిమాంశులఁ బోలిరి
చండ పరాక్రమ విమల యశస్సంయుతులై. 48

ఉ॥ దిక్కరిపాళికిఁ శ్రమము దీర్పఁగజాలినయట్టి బాహువుఁ,
దిక్కరిపాళికన్న వినుతిం గనినట్టి పదద్వయంబునుఁ
దిక్కటి పాలికిం జనిన దీనులఁగాచెడి కేలుఁగల్గి నల్
దిక్కుల గుండయప్రభుని తిమ్మఁడు నించెను గీర్తిచంద్రికల్. 49

ఉ॥ జైమినిభారతంబు తన సద్యశముఁ శశికల్గునంతకుఁ
భూమినినిల్పి, ఫల్గుమని బోల్కని దానొనరించినట్టి సం
గ్రామములం జరిత్రముగ వ్రాసిన నొండొకభారతంబుకా
గా, మహిలో నృసింహజనకాంతుఁడు పొల్చెను గీర్తిమంతుఁడై. 50

ఉ॥ "కల్వలవిందునందుఁ గల కందళిలంబును బోయినట్టి యీ
చెల్వముకంటిరే! సుధవిశేషముగా నిఁక నబ్బు." నంచు వే
ల్పు ల్విభుదాలయంబునను బొంగుచు విందులు సల్పుచుండఁగా
సాళ్వనృసింహ భూవిభు యశంబు భృశంబుగ నిండె దిక్కులన్. 51

ఉ॥ కోవిదసంస్తుతుండయిన గుండయ తిమ్మవిభుండు దేవకీ
దేవిని బెండ్లియాడి, వసుదేవుఁడు దేవకియందు మున్ను రా
జీవ దళాక్షునిం గనిన చెన్నునఁగాంచెఁ గుమారు నీశ్వరుం
గేవల మీశ్వరుండమచుఁ గీర్తినిగన్న ధరాతలేశ్వరున్. 52

సీ॥ ఆశ్రితావనమున, నైశ్వర్యమందు, ర
మేశ్వరుండును, బరమేశ్వరుండు,
సౌందర్యమందు, శాస్త్రవివేచనమున, ర
తీశ్వరుండును, భారతీశ్వరుండుఁ;
బటుధైర్యమున, మహీభరణ దక్షతను న
గేశ్వరుండును, బన్నగేశ్వరుండు,
రాజనీతిని, రణరంగచాతురిని, భ
ద్రేశ్వరుండును, సుభద్రేశ్వరుండు,

బుద్ధినిగణేశ్వరుఁడు. యశంబునను నుడుగ
ణేశ్వరుఁడు, భోగమందుసురేశ్వరుండు,
నిష్టదానతోషిత భూసురేశ్వరుండు,
నగుచుఁ దిమ్మయ యీశ్వరుండవనినేలె. 53

మ॥ ఉదయాద్రిప్రభృతిప్రదేశముల బాహుప్రాభవోపేతుఁడై
కదనక్షోణిని నిల్చి యీశ్వర మహీకాంతుండు నిర్జించి, తా
నుదయాద్ర్యస్త మహీధ్రసేతువర శేతోర్వీధ్ర మధ్యార్వి నా
రదసంచారసమంచితంబుగ నొనర్పం జాలె సత్కీర్తితోఁ. 54

శా॥ "అజిన్ మృత్యువు గల్గునంచు నిటులేలా జంకుచున్నాడఁవో
రాజా, యీశ్వరునిన్ భజింపు, మతడే రక్షించు ని,"న్నంచునుఁ
హేజీబుల్ తెలుపఁ హరుఁ మఱచి తన్నే దిక్కుగాఁ దిమ్మధా
త్రీజాని ప్రియపుత్రు శాత్రవుఁడు ప్రార్థించుఁ దయాపాత్రుఁడై. 55

తే॥గీ॥ ఈశ్వరునికి నర్థాంగియై యెసఁగిన సతి
బుక్కమాంబిక కనియెను బుత్రకులను
విక్రమకుమారు నరసింహవిభు నవక్ర
ధీగుణగణేశ్వరుండైన తిమ్మవిభుని. 56

కం॥ ఈశ్వర నృసింహుఁడేలెఁ
విశ్వంభరనహిత వాహినీ విభుదత్తే
భాశ్వ మణీ గణికా ప్రము
ఖైశ్వర్యయుతాపరామరాధిపుఁడగుచున్. 57

చ॥ వరవరసింహనామమని ధ్రువంబుగ భూతపిశాచవర్గముం
బరుగున దవ్వుదవ్వులకుఁ బాఱెడు నట్లొనరించుచుండ నీ
శ్వరనరసింహనామ మనిశంబును జేరగఁ బిల్చుచుండు న
బ్బురముగ దాపుదాపులకు భూతపిశాచతతిఁ రణక్షితిన్. 58

సీ॥ నరసింహనామ మన్వర్థమే నిజభక్తి
జనుల శ్రీహరిరీతి మనుచుచుంట
నరసింహసంజ్ఞ గణ్యమే సవ్యసాచి కే
సరులతో సరియైనశౌర్యముంట
నరసింహుఁడనునాఖ్య న్యాయమే మనుజవ
ర్గములోన శ్రేష్ఠతఁగాంచియుంట
నరసింహుఁడనుపేరు సరియె శాత్రవ నర
గజయూథములకు పింగమయియుంట

ననుచుఁ బొగడంగనెగడె నమ్రారిమకుట
చారుతరహీరమణి వారతారకాగ
మానుకూలక సాంధ్య రాగాత్మచరణ
రాగరుచిరుండు నరసింహరాజవరుఁడు. 59

గుణమణి యౌనృసింహుఁ డిలఁ గుంతలమాది పదంబు లెల్లఁ దా
రణమున గెల్వఁ దద్విభుపరాక్రమ బాలుఁడు కీర్తిగర్భమం
దణుతఁ దొఱంగి కుంతలములాది పదంబులు గల్గి వెల్వడెన్
వణఁకుచుఁ తద్పదంబులకు వైరులు కుంతలముల్ తగుల్పఁగన్. 60

మ॥ కదియన్‌వచ్చిన కాలకూటమును మ్రింగం బుట్టి యే మందునం
గుదురంబోక మహేశకంఠమున కెగ్గుం జేయు పెన్మచ్చకు
సదయుం డీశ్వరనారసింహుఁడు ప్రశస్తంబైన సత్కీర్తిపా
రదమున్ రాయుచు మాన్పి గౌరిమనసు రంజింపఁజేసెఁ బ్రీ!61

ఉ॥ నిత్యముఁ బ్రీతితోడ నవనీసతి నాదివరాహుఁడట్లు లౌ
చిత్య మెటింగి తాల్చిన న్నసింహవిభుండు కృతిఁ గ్రహించె భా
రత్యమలాంగి ప్రాణము వరాహపురాణము నందిమల్లయా
మాత్య కవీశుఁడుఁ మలయమారుత సత్కవియున్‌రచింపఁగన్.62

క॥ శ్రీ నరసింహుఁడు తిప్పాం
బా నాగాంబా రమణులఁ బరిణయమయ్యెఁ
శ్రీ నారాయణుఁ డల భూ
శ్రీ నీలాలకల మున్ను చేకొన్నగతిన్. 63

క॥ ఆయమ్మలకుఁ గుమారకు
లై యుదయించిరి సమిజ్జయకుమారకులై
పేయరులకు మారకులై
యీ యిల వీరనరసింహ కృష్ణనరేంద్రుల్. 64

ఉ॥ తిప్పమదేవి నందనుఁడు ధీరుఁడు వీరకృపాహుఁ డెల్లెడం
గుప్పలు కుప్పలట్లుగఁ గకుప్పులఁ గీరితిగప్పురంబుఁ బా. I.
గప్పెను : దత్ప్రతాప మధికంబుగ దాని వెలుంగఁజేయగా
గుప్పునలేచి క్రమ్మె రిపుకోటుల దుర్యశంపుబొగల్ ధరన్. 65

RAMAMEMORIAL LIBRARY
P.V.NARLA
P.R.I.
ACC. NO.
N.D.A.

శా॥ నాగాంబా నరసింహ పుత్రుఁడయి జన్మంబందె నాజన్మ స
ద్యోగంబుల్ తనరం ద్రిరత్నగుణచంద్రుల్ కల్గు శాకాబ్దముల్
కాఁగన్ విర్వికృతిత్వమౌ వికృతి రాగం బుష్యమందున్ సగం
బేగ ద్వాదశి శుక్రవాసరమునం గృష్ణావనీంద్రుం డిలన్. 66

ఆ॥వె॥ అన్నగారివెనుక నవనీభారముఁ దాల్చె
నన్నగారిఁ బోలునట్టి కృష్ణ
దేవరాయ లఖిల దిక్కుల రాజులు
"దేవరా" యటంచు సేవ సలుప. 67

సీ॥ శూరకులంబు సంశోభింపఁ బుట్టి మ
హానంద జన్మ విఖ్యాతిఁ గాంచి
నవనీతదధిహరణ యశంబు గడియించి
పుణ్యబృందావనంబునను మెలఁగి
యహితాపకారి యౌనట్టుల నటియించి
గోవర్ధనకరత్వ మావహించి
చేపట్టఁగోరు నెచ్చెలులకుఁ బ్రియుఁడయి
యక్రూరవిజ్ఞప్తి లాదరించి
యుగ్రసేనాతి వశముగా నుండునట్లు
మథురనొనరించి విజయసంబంధుఁడగుచు
ధర్మపరిపాలనము నిల్పి ధరను గృష్ణ
దేవుఁడే కృష్ణదేవుఁడై తేజరిల్లు. 68

మ॥ ధరసింహాసనమై వభంబుగొడుగై దైవాఅఁగా ధారుణీ
వ రసింహుండను సుప్రసిద్ధిగని దుర్వారారిభూమీశ సిం
ధురసింహుండయి సింధురక్షితధర ధో: పీఠిపై దాలిచెన్
నరసింహాధిప కృష్ణభూధవుఁడు శ్రీనారాయణుండట్లుగన్. 69

సీ॥ అభ్రము సభ్రమునందు మద్దాడంగఁ
జొదంతి కిప్పుడు సందు దొరకె;
క్షమతోడ క్షమతోడ సరసంబు లాడ నా
దివరాహమున కిప్డ వ్యవధి యొదవె;
మేనక మేనకటా! నిమురఁగ గోరు
హిమవంతున కిపుడు సమయమయ్యె;
భోగముల్ భోగముల్ ముడిచి పొందఁగ శేష
ఫణి కియ్యెడలఁ దీరుబాటు కలిగెఁ;

గూర్మితోఁ గూర్మితోడను గూడియాడఁ
గమఠనాథున కిపు డవకాశమబ్బె
స్థిర స్థిరముగాఁగ నిజభుజాసీమయందుఁ
గృష్ణరాయప్రభుండు భరించుచుంట. 70

కా॥ అస్తోక ప్రతిభాపరామరగురుండౌ కృష్ణరాయండు శ
త్రుస్తోమా త్యపకీర్తిధూమ మిల నెందుంబుట్టు నందందుఁ దా
నిస్తంద్రోగ్ర నిజప్రతాప విపులాగ్నిం గూరుచున్, యత్ర ధూ
మస్తత్రాగ్ని యటన్న న్యాయము మదిం బాటించుచున్ మాటికిన్. 71

మ॥ నరసింహప్రభు కృష్ణరాయు రిపుతండంబుల్ విదారింప భా
స్కర బింబంబునఁ బుట్టు రంధ్ర మతితేజం బుంటచే నం దగో
చరమయ్యెం, బ్రతిబింబితం బగుచు మచ్చంబోలెఁ దోచుఁ స్వకీ
య రుచుల్ లేక రవిప్రభఁ వెలుఁగు సీహారాంశు బింబంబునన్.72

ఉ॥ అచ్చపు టాటకత్తియ కదాఁ మెడపైఁ బడి కొందటఁ, హృదిఁ
గ్రుచ్చి కవుంగిలించుకొని కొందటఁ గొందటఁ, బెద్దనిద్దురం
బుచ్చుచుఁ గృష్ణరాయు నసిపుత్రిక శత్రుల మాయఁజేయుఁ; వా
రచ్చర లబ్బినన్ మఱవ రచ్చెలి మర్మవిభేద కార్యముల్. 73

సీ॥ మహిశూరవాసులు మహి శూరులన్న వి
ఖ్యాతి పోవఁగ శరణార్థులైరి;
గంగవంశపు నృపుల్ గంగ వంశపుఁగీర్తి
కలియ వినమ్రులై కొళ్ళఁబడిరి;
శివసముద్ర ప్రజల్, "శివఃసముద్రమె దిక్కు
మా కిఁ," కంచును గాందిశీకులైరి;
శ్రీరంగవాసులు, "శ్రీరంగఃరంగ! రం
గాఃఁ," యటంచును గంపితాంగులైరి,

దిక్కు లదరంగ, సప్త ధాత్రీధరములు
గ్రక్కదలఁ, గృష్ణరాయ ధరావరుండు
విపులసేనతో యామ్య దిగ్విజయయాత్ర
కేగునెడలఁ దద్రణభేరి మ్రోఁగినంత.

చ॥ ఉదయగిరిం గలట్టి బలియుం బ్రహరేశ్వరపాత్రు నొంచి, దు
ర్మదుఁడగు వాడు దాల్చు నవరత్నకిరీటము కాలిపీఁటగా
సదమల వారిపూరముల స్నానమొనర్చి జయేందిరం గొనెం
ద్రిదశులు మెచ్చఁ గృష్ణజగతీతల కాంతుఁడు నూత్నకాంతుఁడై. 75

చి॥ కనకగిరిన్ వసించునెడఁ గల్గక మానదు స్వర్గవాస మం
చును భయమంది కావలయు సూనులుఁ జానలుఁ దానుఁ దాని గ్ర
క్కున విడనాడి వింధ్యమునకుం జనియెన్ ముసు వీరభద్ర రా
జనిమొనఁ గృష్ణరాయ వసుధాధిప సింహుఁడు నిల్చి పిల్చినన్. 76

చ॥ రణమున నోడి కృష్ణు మది రంజిలునట్లు మణీ నిజాత్మజా
మణులను దెచ్చి యిచ్చి విషమం బగునట్టి గుహాంతరంబునం
దణఁగిన వీరభద్ర వసుధాధిపుఁ దొల్లిటి భల్లుకేంద్రుఁగా
గణుతి యొనర్చి భిల్లజనకాంతులు కొల్తురు వింధ్యభూములన్. 77

సీ॥ కొండవీడు జనులు కొండవీడుట మాని
కావించి రచటనే కాఁపురంబు;
విజయవాటిక వారు విజయవాటిక యిఁక
దమ యూరు కాదని తల్లడిలిరి;
రాజమహేంద్రవర ప్రజల్ "రాజమ
హేంద్రా!" యనిరి చేతులెత్తి మ్రొక్కి;
యొడ్డెమూఁకలు చేతులొడ్డె మూకస్థితి
భయకారణమున సంప్రాప్తి కాఁగ;

దిక్కులదరంగ సప్తధాత్రీ ధరములుఁ
గ్రక్కదలఁ గృష్ణరాయ ధరావరుండు
విపులసేనతోఁ బూర్వదిగ్విజయ యాత్ర
కేగునెడలఁ దద్రణభేరి మ్రోఁగినంత. 78

శా॥ నాగంబుల్ కల కృష్ణరాయవిభు సేనల్ త్రాగుటం జేసి కృ
ష్ణా గోదావరు లందుఁ గల్గు జలముల్ సంపూర్తిగా శూన్యముల్
కాఁగా వానిని దానధారల యథాకారంబుగా నించుఁ బు
న్నాగ ఖ్యాతి వహించినట్టి తన తుండాలంబులుం దానునున్. 79

శా॥ సీతానాథ సమానవీరుఁ డగు నా శ్రీకృష్ణరాయేంద్రు వి
ఖ్యాతిన్ లోకులకెల్లఁ దెల్లముగ వ్యాఖ్యానంబు గావింపఁగాఁ
బాతాళంబున నుండి వెల్వడిన సర్పస్వామియే నాఁగ సం
జాతం బయ్యెను బొట్టునూరి విజయస్తంభం బహీనాకృతిన్. 80

మ॥ తన ధైర్యం బచలంబు గాఁగఁ బరఁగం దామేటి యాకార మొ
ప్ప, నృసింహాధిప కృష్ణరాయఁడు మథింపన్ భంగముం గన్న జీ
వనముం గల్గు ప్రతాపరుద్రుఁ డొకఁ డేవం దానదీనత్వముం
గని, లక్ష్మిం దనకూఁతు నిచ్చి ముదితుం గావించె భూమీశునిన్. 81

మ॥ అవిలోనఁ నరసింహ కృష్ణవిభునత్యంతోగ్రతేజంబు వం
కను గన్నెత్తియుఁ జూడనోడిన తురుష్క క్షోణిపుల్ మింటిత్రో
వను దత్తేజపు ముక్కయే యనుచు భావంబందు మోహించి, సూ
ర్యునినెమ్మేనును జీల్చుచుం జనుదురోహో! యెంతమూఢాత్ములో! 82

ఉ॥ ఏఁడిలఁ గృష్ణరాయ ధరణీశునితో నని సేఁయఁగల్గువాఁ?
డేడిలఖాను, బీజపుర మేలుపటా, నటుచేసి, ప్రాణముల్
వీడి, యముండు జేఁడయిన వీటికిఁ బోవక, రంభమేడకున్
వీడియముం గొనం జనియెఁ,వేల్ప్ బొజుంగులు వెచ్చనూర్చఁగన్.83

సీ॥ ఊర్వశి నెమ్మేని హొయలు చూపుటమాని,
బురఖాను ధరియించి తిరుగసాగె,
మేనక చీరలు మాని యిజారులుఁ
గుడితినీలిన్ వేసికొనగఁసాగె;
రవికల విడనాడి రంభ జుబ్బాలు క
బ్బాలు బిబ్బీ లట్లు వాడసాగె;
లోచనంబులకుఁ దిలోత్తమ కాటుక
మాని సుర్మా నిత్యమూనసాగెఁ;

గృష్ణరాయ కరాపిచేఁ ద్రెళ్ళి గోల
కొండ బీజపురంబులనుండి స్వర్గ
పట్టణంబున కరుదెంచినట్టి దొడ్డ
ఖాను బిడ్డల కుంపుడుకత్తె లగుచు. 84

ఉ॥ రాజు కరంబుఁ బేదలఁ దిరంబుగ శ్రీదులఁ జేయు నీవిచే;
రాజు సతీజనాళి కనురాగము కల్గఁగ జేయు రూపుచే;
రాజు సుధామయంబుగ ధరావలయంబును జేయుఁ గీర్తిచే;
రాజు నృసింహకృష్ణుఁ డవురా! భువిలోన సమస్తకీర్తులన్. 85

సీ॥ శరముతో, శరదంబుధరముతో. మౌక్తిక
సరముతో, ధవళ చామరముతో, భి
దురముతో, రజిత భూధరముతో, నమర కుం
జరముతో, సురనదీ ఝరముతో, మి
హిరముతో, నమృత శీకరముతో, జంద్రికో
త్కరముతో, దుగ్ధ సాగరముతో, గ
పురముతో, బరిశుభ్ర దరముతో, బన్నగ
వరముతో, నవబిసాంకురముతో స

మం బనుచుఁ గవుల్ తనదు యశంబు పొగడ,
గాయకులు, "సరిగా, సరిగా," యని శిర
ములు కదపఁ. గవితాగానములకు మాత్ర
మలరు శ్రీకృష్ణదేవరాయ ప్రభుండు, 86

కోటులు గాఁగ గృష్ణవిభుఁ గూర్చి కవుల్ విరచించినట్టి యా
చాటువు లెల్ల, గూర్చినఁ బ్రబస్తతరంబగు గ్రంథమౌను; గ
ర్ణాట కవీశు, లాంధ్ర కవినాథులుఁ దత్సభ మాటిమాటికిన్
మేటుల మేమె మేటులము మేమె యటందురు కాటులాటగాన్, 87

సీ॥ మనుచరిత్రము కృతిగ నొసంగి పెద్దనఁ
దగు నాంధ్రకవితాపితామహుండు,
నర్థిమైఁ బారిజాతాపహరణము కృ
తిగ నొసంగిన నంది తిమ్మనకవి,

మాటల నతులిత మాధురీ మహిమంబు
తోడఁ బల్కుచునుండు ధూర్జటికవి
రస ముప్పతిలుచుండ రచనచే సుధ వెదఁ
జల్లు మాదయగారి మల్లనకవి

మున్నుగల యష్ట దిగ్గజంబు లను కవుల
మంత్రిసత్తముఁడైన తిమ్మరసుఁ గూడి
భువనవిజయ నామక సభాభవనమందు
నోలగంబుండు కృష్ణభూపాలకుండు. 88

ఉ॥ తానుఁ గవీశ్వరుండఁటఁ! సచా తనచుట్టును గూరుచుండి స
న్మానము లందువారు కవితల్లజులే యఁటఁ! నైజ రాజధా
నీనగరంబు కృష్ణధరణీతల నేతకుఁ బేరుగన్న వి
ద్యానగరంబు గాఁగఁ దనరారుటలోన విచిత్రమున్నదేఁ 89

చ॥ తెనుఁగు నృపాలుడై నరపతిత్వము కల్గిన వీరభద్రు పు
త్రిని, మఱి యోర్వఱుడై గజపతిత్వము కల్గు ప్రతాపరుద్రు పు
త్రిని వరియించియుం దురకపేఁడగు నశ్వపతీశు పుత్రిఁ గై
కొనక నృసింహకృష్ణుఁ డొనగూర్చెను బంక్తిని బక్షపాతమున్. 90

సీ॥ ప్రజలను ధాత్రియై రక్షించు నొక్కతె,
సిరులిచ్చి మనుచును శ్రితుల నొకతె;
నిరత క్షమాఖ్యతోఁ జరియించు నొక్కతె;
శ్రీకాంత యనఁగను జెలఁగు నొకతె;

సుగుణంబులను ననంతగ నొప్పు నొక్కతె;
యగును జంచల చూపులందు నొకతె;
రమణుని పలుగారవము లొందు నొక్కతె,
మగని యెదకు హత్తి మసలు నొకతె.

భూసతియు శ్రీసతియు నాఁగ వాసిగాంచి
యున్న యన్నపూర్ణాదేవియును దిరుమల
దేవియును బట్టపు దేవులై వెలసెను
గృష్ణరాయప్రభుండు శ్రీవిష్ణునిభుఁడు. 91

తే॥గీ॥ కనె సుతల మోహనాంగి నైన ననుఁ దిరుమ
లాంబయందు, నా చెల్లెలైనట్టి వేంగ
శాంబ నన్నపూర్ణాంబిక యందు మాదు
జనకుఁడగు కృష్ణరాయ రాజన్యమౌళి. 92

సీ॥ ఆముక్తమాల్యద నంకితంబిందిన
యిలువేల్పు శ్రీవెంకటేశ్వరుండు,
తత్ప్రబంధంబు నందలి కథానాయకుం
డైయున్న శ్రీరంగనాయకుండు,
తనుఁ దత్కృతి రచింపుమని కలం బ్రత్యక్ష
మైనట్టి శ్రీకాకుళాంధ్ర విష్ణు,
నా ప్రబంధంబు వ్రాయకమున్నుఁ దాఁగొల్చి
నట్టి శ్రీసింహాచలాధిచేత,

సర్వగతుల రక్షింప రాజపరమేశ
రాజ రాజాధిరాజ వీరప్రతాప
మూరు రాయరగండ ప్రముఖ బిరుద స
నాథుఁడై కృష్ణరాయ భూనాథుఁ డలరు. 93

కం॥ ఏవంవిధ చరితునకు, శ్రీ
తావన సమయ స్ఫుర ద్దయా భరితునకుఁ,
శ్రీవేంకటేశ పద సం
సేవా పరిలబ్ధ పుణ్య జితదురితునకున్. 94

కం॥ విద్యాభోజునకుఁ బ్రచం
డద్యుమణి సహస్రతేజునకు, శ్రితపాళీ
సద్యస్స్మరభూజున, కన
వద్య గుణ సమాజునకు నవమనోజునకుఁ. 95

క॥ హరిచందన హరిచందన
శరకుంద నవారవింద శశి శరదంభో
ధర తారక ధరతారక
దరహీరక హార తుషార ధవళ యశునకున్. 96

క॥ స్వభుజాయత బలశమిత ది
గిభునకు రఘు ముఖ్య పూర్వనృపతి నిభునకున్,
త్రిభువన శుభకర గుణ సౌ
రభునకు నరసింహ కృష్ణరాయ విభునకుఁ. 97

క॥ ఆమిత నిజాశ్రిత గృహ వ
ర్ధమాన బహు వస్తు వాహ ధన కనకునకున్
విమతాళి కనకునకు ని
ర్మమతా గుణ జనకునకును మజ్జనకునకున్. 98

వ॥ సభక్తి తాత్పర్యంబుగా సాష్టాంగ దండప్రణామంబు లాచరించి తద్రాజ కందర్పజనకునకు సమర్పణంబుగా నాచే నొనర్పంబడిన శ్రీ మారీచీపరిణయ ప్రబంధమునకుఁ గథాక్రమం బెట్టిదనిన. 99

చతుర్థాశ్వాసము

క॥ శ్రీ సుమశర సమరూప వి
లాస విభాసుర సుపుత్ర లాభప్రాప్త!
శ్రీ సామ్య తిరుమలాంబా
వాస హృదయ! కృష్ణరాయ వసుధాభ్యుదయా! 1

వ॥ తండ్రీ! నాయెనర్చిన పుణ్యం బగణ్యంబనుట నిస్సంశయంబు. ప్రశంసా పూర్వకంబుగా మీరు నా కరంబున నిశ్చయ తాంబూలంబు పెట్టినది యెట్టి శుభముహూర్తంబో కాని, మీరు పరిగ్రహించి ధన్యం జేయనెంచిన నా కావ్యకన్య కరచరణాదవ్యయవంబు లేర్పడి మత్కవితా గర్భంబునుండి వెలువడకమున్న వెలందుల తలమిన్న యైన మా యంబ తిరుమలాంబాదేవి గర్భంబు ఫలించి, పాలకడలి సంతానంబు వడువున నామె చిరకాంక్షిత పుత్రసంతానంబు పడసినది. సదాశివు సత్కృపం బొడమిన మా తమ్ముడు సదాశివుఁడు శుక్లపక్ష యామినీ ధవుఁడుం బోలె దిన దిన ప్రవర్ధమానుండై, సౌందర్యంబున గందర్ప సమానుండై తల్లి

దంద్రుల రగు మీకు, నక్కలమగు మాకుఁ దక్కుంగల యెల్లవారలకు
నల్లారు ముద్దుగాఁ బెరుఁగుచున్నవాఁడు. 2

శా॥ మార్కండేయచిరాయువుఁ, సకల సామ్రాజ్యంబు, నాచంద్ర తా
రార్కంబైన యశంబునుం గలిగి, యే యంశంబునన్ దోష సం
పర్కం బొందక, కోరుచే తడవుగా మా ముద్దుతమ్ముండు తాఁ
గోర్కుల్ తీరి, సదాశివుం డగుచు నీ క్షోణిన్ మనుం గావుతన్. 3

వ॥ చిరకాల మనోభీష్టసిద్ధిచే సంతుష్టాంతరంగుడవై యున్న యో తండ్రీ!
పరాకుమాని యవధరింపు. మనంతర కథావిధానం బెట్టిదనిన.— 4

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.

కథాసంగ్రహము

(ఆశ్వాసక్రమమున శ్రీ సెట్టి లక్ష్మీనరసింహముగారు ఇచ్చినది
సమదర్శిని, ఉక్క, 1929-30)

1-వ ఆశ్వాసము:-పదునాలుగేండ్ల బాలిక యొకతె దక్షిణసముద్ర తీరమున శరత్కాల పూర్ణిమారాత్రి నొంటి కత్తె యై యాట లాడుకొనుచుండఁగా, విశ్వామిత్ర యాగా వనము చేయుచున్న లక్ష్మణుని బాణముచేత తూలఁ గొట్టఁ బడిన మారీచుఁ డచ్చట గబాలున మ్రోఁదినుండి పడి మూర్ఛచెంది, యా బాలిక చేసిన శీతలోపచారముల వలన సేదదేఱి, యామె కంతవఱకును మాటలాడు సామర్థ్యము గాని ప్రపంచ జ్ఞానము గాని లేకుండుట యెఱింగి, సరస్వతిని బ్రసన్నురాలినిగాఁ జేసికొని, యా బాలికకు సర్వభాషా జ్ఞానమును, వేదశాస్త్రాది విద్యాజ్ఞానమును, ప్రపంచ జ్ఞానమును కలిగించి, దండకారణ్యమున నొక పర్ణశాలయందు నామెయుఁ దానును నివసించుచుండును.

మారీచుని పుత్రికయై యా బాలిక మారీచియైనది.

2-వ ఆశ్వాసము:-మారీచి యడుగఁగా మారీచుఁడు తన వెనుకటి వృత్తాంత మామెకుఁ దెలుపును. (ఆ విధముగా రామాయణ కథ సీతారామలక్ష్మణుల పర్ణశాలా

నివాసము వఱకును నడుచును.) మారీచుని పర్ణశాలకు సమీపమునఁ గల పుష్పోద్యానమందు మారీచీ లక్ష్మణు లొండొరుల జూచుట తటస్థించును. వారి కొండొరులపై మోహ మంకురించి, మొలకెత్తి, యెదుగసాగును. అది తెలిసి మారీచుఁడు లక్ష్మణునిపైఁ దనకుఁ గల భయము చేతను గోపము చేతను దన నివాసము లంక కీవలి యొడ్డునఁ గల సముద్ర తీరమునకు మార్చుకొనఁగా, పుష్పకముపై రాకపోక లొనర్చు రావణుఁడు మారీచిని జూచి మోహించి, యామెను దొంగిలించి కొనిపోవుటకై సమయ మరయు చుండును. మాయల మారీచుఁడు జీవించి యుండగా అట్టి పని సాధ్యము కాదని వాఁడు తెలిసికొనును.

3-వ ఆశ్వాసము:- శూర్పణఖా పరాభవము. ఖరా దుల మరణము. శూర్పణఖ రావణునిత్రోఁ దన పరాభవ మును, సీతారామలక్ష్మణుల వృత్తాంతమును దెలిపి, సీతాప హరణమునకునుఁ బ్రేరేచును. అంతకంఁటె మారీచ్యప హరణమును, మారీచ మరణమును ముఖ్యముగాఁ గోరు చున్న రావణుఁడు తగిన మిషదొరకుటకు సంతోషించి, మారీచుని మాయలేడిగాఁ బంపించి, చంపించి "రామా రామా" యని యేడ్చుచున్న సీతను, "లక్ష్మణా, లక్ష్మణా," యని యేడ్చుచున్న మారీచిని బలాత్కారముగా లంకకుఁ గొనిపోయి, వేఱుచోట్లఁ బెట్టును.

4-వ ఆశ్వాసము:-సీతాన్వేషణము. సుగ్రీవసఖ్యము. సుందరకాండ కథ. సేతుబంధనము.

5-వ ఆశ్వాసము:-యుద్ధము. లక్ష్మణమూర్ఛ. పదునాలుగేండ్లు నిద్రాహారములు లేని వారు సంజీవి పోసిననే తప్ప పదునాలుగేండ్లు నిద్రాహారములు లేని లక్ష్మణుడు మూర్ఛ లేవఁడని జాంబవంతుఁడు చెప్పఁగా, అట్టిది మారీచి యని నారదుని వలన విని యామెను దెప్పించి, హనుమంతుఁడు తెచ్చిన సంజీవి మూలమున రాముఁడు లక్ష్మణుని బ్రదికించుకొనును. నిరాశ్రో రాముఁడు యుద్ధము మానుకొనఁబోగా, నారదుఁడు రావణునికి బ్రహ్మవలనఁ గలిగిన శాపమును గూర్చి చెప్పును. ఆ శాప మేమనఁగా:- రావణుని తపస్సునకు మెచ్చి బ్రహ్మ ప్రత్యక్షమై వరము కోరుకొమ్మనగా రావణుఁడు తనకుఁ జావులేమి కోరెను. అది స్వభావ విరుద్ధమని బ్రహ్మ యనఁగా, "కూఁతును గామించుట మాత్రము స్వభావ విరుద్ధము కాదా? అట్టిది జరుగుచుండుట లేదా? తాతా," యని రావణుఁడు గేలి చేసెను. "కూఁతును గామించిననే నీకుఁ జావు కలుగఁ గలదు; అంతవఱకును గలుగదు." అని బ్రహ్మ యదే శాపముగాను వరముగాను బలికెను. ఈ శాపవృత్తాంతము తెలిపి నారదుఁడు, "రామా, బ్రహ్మ శాపము ఫలించి రావణుఁ డిక్కఁ జచ్చుట తప్ప," దని తెలు

పును. అది యెట్లనిన: నలకూబరుని కడకుఁ బోవుచున్న రంభ కైలాసప్రాంతమున రావణుని కంటఁబడఁగా, వాఁ డామెను బలాత్కరించి పోయెను. సద్యోగర్భమున రంభ యొక స్త్రీ శిశువును కని జుగుప్స కతమున దాని నచ్చటనే పాఱవైచి చనియెను. ఆ శిశువు రోదనము విని కైలా సము నుండి పార్వతీపరమేశ్వరులు దిగివచ్చి, యా శిశు వును దమ విమానముపై నెక్కించుకొని, యా బాలిక నెవ్వ రైనను దీసి పెంచువఱకు నపాయము గాని యాఁకలి నిద్రలు గాని కలుగకుండునట్లు వరములిచ్చి, సముద్రతీరమున డించి పోయిరి. ఆమె యచ్చట నొంటిగా పదునాలుగేండ్లుండి తుదకు మారీచుని పుత్రిక యయ్యెను. కాఁబట్టి మారీచి రంభా రావణుల పుత్రిక. పుత్రికను గామించిన రావణుఁడు చచ్చుట తప్పదని నారదుఁడు రాముని కెఱిఁగించెను.

6-వ అశ్వాసము:-రావణవధ. సీతాగ్నిప్రవేశము సీతారామ లక్ష్మణు లయోధ్యకు తిరిగివచ్చుట. ఊర్మిళా దేవి నిద్ర. ఆమె పొలయలుక. మారీచీ పరిణయము.

A0044(0081)21

S'RĪ ...ADĒVARĀYA'S DAUGHTER,

MŌHANĀṄGI'S

MĀRĪCĪPARIṆAYAMU

Topics discussed in the Introduction

1. Daughters of Kṛṣṇadēvarāya. Did Kṛṣṇadēvarāya have a daughter named Mohanāṅgi?
2. The Authorship of the *Mārīcīpariṇaya* and the date of its composition. The acquaintance of Telugus with the *Mārīcīpariṇaya.*
3. If Mohanāṅgi is not the author of the *Mārīcīpariṇaya,* who could have composed it and when?
4. If Mohanāṅgi was the author of the *Mārīcīpariṇaya,* when she could have written it?
5. The *Āmuktamālyada* — the date of its composition.
6. The Dates of Composition of the works, the *Pārijātāpaharaṇa,* the *Manucaritra* and the *Pāṇḍuraṇga Māhātmya.*
7. The Contemporaneity of Kṛṣṇadēvarāya and Tenāli Rāmakṛṣṇa.
8. Did the second (Sāluva) and the third (Tuluva) dynasties have a common ancestor? Were the Tuluvas a collateral branch of the Sāluvas?
9. Was Kṛṣṇadēvarāya's mother a mistress of Narasānāyaka?
10. The Date of Birth of Kṛṣṇadēvarāya.
11. Vīranarasiṁharāya and Kṛṣṇadēvarāya.
12. The capture of Udayagiri — The name of the uncle of the Gajapati in charge of the Udayagiri fort.
13. Death of Ādilkhan, the ruler of Bijapur.
14. Certain Incongruities.
15. The Queens of Kṛṣṇadēvarāya.

BC

ముద్రణ ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	AOUA104B121
పుస్తకం పేరు	మూర్తీభవించిన ప్రేమ
తారీఖు	31 December 2025
ముందు అట్ట	YES
వెనుక అట్ట	YES
మొత్తం పేజీలు	207
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	NO
లేని పేజీలు	NO
తయారు చేసినది	P. Jayalakshmi
పేజీలు విడదీసినది	P Jayalakshmi
స్కాన్ చేసినది	anusha
పరీక్ష చేసినది	anusha
పేజీలు పరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పంపినది	గుంటూరు